


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 01-05-2022 సంపుటి : 03 సంచిక : 227 పేజీలు : 4 వెల : రూ 3-00







## సీఎం-న్యాయమూర్తుల సదస్సు..

### సీజే ఎన్వీ రమణ, ప్రధాని మోదీ హాజరు




భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, రాష్ట్రాల ముఖ్యమంత్రుల సంయుక్త సదస్సు కొనసాగుతోంది. శనివారం ఉదయం విజ్ఞాన్ భవన్‌లో మొదలైన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజ్జు కూడా హాజరయ్యారు. నేషనల్ జ్యుడీషియల్‌న్ఫ్రాస్ట్రక్చర్ సదస్సులో సీజే, ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకాగా, తెలంగాణ తరపున న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హజరయ్యారు. దాదాపు ఆరేళ్ల తర్వాత ఈ సదస్సు జరుగుతోంది.

సదస్సు లో ఐదు అంశాలపై చర్చ

1. న్యాయస్థానాలలో ఐటీ నెట్‌వర్క్ బలోపేతం , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా న్యాయస్థానాల ఉత్తర్వుల చేరవేత, జిల్లా కోర్టులో శాశ్వత క్యాడర్ నియామకం.
2. జిల్లా కోర్టులో బలోపేతం కోసం సమర్థవంతమైన మానవ వనరుల నియామకం.
3. కేంద్ర , రాష్ట్ర యంత్రాంగం ద్వారా జిల్లా కోర్టుల మౌలిక వసతుల బలోపేతం, నైపుణ్యాల అభివృద్ధి.
4. న్యాయ వ్యవస్థలో సంస్కరణలు: మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి ప్రోత్సాహం.
5. హైకోర్టు జడ్జి ల నియామక ప్రక్రియ , సిఫారసుల అమలు వేగవంతం.

స్థానిక భాషలోనే కేసుల విచారణ: ప్రధాని మోదీ

సామాన్యుడికి అర్థమయ్యేలా న్యాయ పరిభాష ఉండాలన్నారు ప్రధాని నరేంద్ర మోదీ. న్యాయస్థానాల్లో స్థానిక భాషలోనే కేసుల విచారణ జరగాలని.. అప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఢిల్లీలో జరిగిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, రాష్ట్రాల ముఖ్యమంత్రుల సంయుక్త సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడారు. సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు సహా అన్ని రాష్ట్రాల సీఎంలు ఈ సమావేశానికి హాజరయ్యారు. కాలం చెల్లిన 1450 చట్టాలను కేంద్రం రద్దుచేసిందని.. రాష్ట్రాలు కూడా పనికిరాని చట్టాలను రద్దుచేయాలని ప్రధాని మోదీ సూచించారు.

పిల్‌ను ఆయుధంగా వాడుతున్నారు: సీజేఐ ఎన్వీ రమణ




ప్రజా ప్రయోజన వ్యాజ్యాల దుర్వినియోగంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఆందోళన వ్యక్తంచేశారు. కొందరు వీటిని పర్సనల్ ఇంట్రెస్ట్ లిటిగేషన్‌గా మార్చుకుంటున్నారన్నారు. వ్యవస్థలను స్థంభింపజేయడానికి పిల్‌ను ఆయుధంగా వాడుతున్నారని ఆక్షేపించారు. అందుకే ప్రజాప్రయోజన వ్యాజ్యాల విచారణ సమయంలో న్యాయమూర్తులు అత్యంత జాగూరతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీజేఐ రమణ పేర్కొన్నారు .

న్యాయమూర్తులు విధి నిర్వహణలో తమ పరిమితులను గుర్తుంచుకోవాలన్నారు

## న్యాయ భాష సామాన్యులకు అర్థమయ్యేలా ఉండాలి: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: న్యాయ భాష సామాన్యులకు అర్థమయ్యేలా ఉండాలని ప్రధాని మోదీ అన్నారు. కోర్టుల్లో న్యాయ వ్యవహారాలన్నీ ఇంగ్లిష్‌లోనే జరుగుతున్నాయని, అలాకాకుండా స్థానిక భాషలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. స్థానిక భాషలతో సామాన్యులకు న్యాయవ్యవస్థలపై విశ్వాసం పెరుగుతుందనన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న సీజేలు, సీఎంల సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ప్రధాన సమస్యల పరిష్కారంలో న్యాయవ్యవస్థ పాత్ర కీలకమైనదని చెప్పారు. న్యాయవ్యవస్థ బలోపేతానికి మరిన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సామాన్యులకు చట్టంలోని చిక్కులు కూడా తీవ్రమైన అంశమని చెప్పారు.సుప్రీంకోర్టుతోపాటు హైకోర్టు, జిల్లా కోర్టులు బలోపేతమవ్వాలని ప్రధాని సూచించారు. న్యాయవ్యవస్థలో ఖాళీలను భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. అత్యాధునిక సాంకేతికత సాయంతో మరిన్ని సంస్కరణలు రావాలన్నారు. డిజిటల్ ప్రపంచంలో సాంకేతికత ప్రధాన వనరుగా మారిపోయిందని చెప్పారు. సీఎంలు, హైకోర్టు సీజేలు డిజిటల్ ఇండియా ప్రగతిలో కలిసిరావాలని కోరారు.దేశంలో డిజిటల్ లావాదేవీలు అసంభవమని చెప్పారు. కానీ నేడు దేశంలోని మారుమూల ప్రాంతాల్లో కూడా డిజిటల్ లావాదేవీలు నడుస్తున్నాయని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు భారత్‌లోనే జరుగుతున్నాయన్నారు. న్యాయవ్యవస్థ మౌలిక సదుపాయాలను కూడా డిజిటలైజ్ చేయాలని పేర్కొన్నారు. దేశంలో అసంబద్ధంగా మారిన సుమారు 1800 చట్టాలను గుర్తించామని, వాటిలో 1450 చట్టాలను రద్దుచేశామన్నారు. కానీ రాష్ట్రాలు మాత్రం 75 చట్టాలను మాత్రమే రద్దు చేశాయని వెల్లడించారు.ఆరేండ్ల తర్వాత హైకోర్టు సీజేలు, సీఎంల సంయుక్త సమావేశం జరుగుతున్నది. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు పాల్గొన్నారు. రాష్ట్రం తరపున మంత్రి ఇంగ్రకరణ్ రెడ్డి హాజరయ్యారు.

## టీడీపీ నేతలపై వైసీపీ గూండాల దాడి దుర్మార్గం: చంద్రబాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో టీడీపీ నేతలపై వైసీపీ దాడిని తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఖండించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి పాల సొసైటీ ఎన్నికల్లో నామినేషన్‌కు వెళ్తున్నటీడీపీ నేతలపై వైసీపీ గూండాల దాడి దుర్మార్గమన్నారు. టీడీపీ నేత చలపతి నాయుడుపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఎన్నికలంటే వైసీపీ ఎందుకు భయపడుతోంది? అని ప్రశ్నించారు. నామినేషన్ పత్రాలు లాక్కెళ్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు? అని నిలదీశారు. దాడులు చేస్తున్న వైసీపీ నేతలను కట్టడి చేయలేని పోలీసులు... నామినేషన్‌కు వెళ్తున్న టీడీపీ నేతలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని చంద్రబాబు అన్నారు.



## ఏలూరు జిల్లాలో ఉద్రిక్తత..

### వైకాపా ఎమ్మెల్యేపై దాడి!



ఏలూరు: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో వైకాపాలో వర్గపోరు బహిర్గతమైంది. ఇక్కడ ఈ ఉదయం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి.జి.కొత్తపల్లిలో ఇవాళ వైకాపా నాయకుడు గంజి ప్రసాద్ హత్యకు గురయ్యాడు. హత్యకు గురైన వైకాపా నాయకుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు గోపాలపురం వైకాపా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వెళ్లారు.ఈ క్రమంలో ఎమ్మెల్యేను పార్టీలోని మరో వర్గం అడ్డుకొని దాడికి దిగింది. ఎమ్మెల్యేను వెంబడించి ఓ ప్రాంతంలో వైకాపా వర్గీయులు చుట్టుముట్టి దాడి చేశారు. దీంతో పోలీసులు ఎమ్మెల్యేకు రక్షణగా నిలిచి ఆయనను పక్కకు తీసుకెళ్లారు. దీంతో ఆ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. జి.కొత్తపల్లిలో ఇరువర్గాల మధ్య ఆధిపత్యంలో గంజిప్రసాద్ హత్య



జరిగినట్లు సమాచారం. మరో వర్గానికి మద్దతు వల్లే హత్య జరిగిందంటూ ఎమ్మెల్యేపై దాడికి దిగినట్లు తెలుస్తోంది. వైకాపాలోని మరో వర్గం రాళ్లదాడిలో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. తోపులాటలో వైకాపా కార్యకర్తకు గాయాలవడంతో అతడిని ఆస్పత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో నిందితులు..

మరోవైపు గంజి ప్రసాద్ హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైకాపా కార్యకర్తలు మండవల్లి సురేశ్, మోహన్‌కుమార్, హేమంత్ కుమార్ పోలీసుల అదుపులో ఉన్నారు. గంజి ప్రసాద్‌ను జి.కొత్తపల్లి వైకాపా ఎంపీటీసీ బజారయ్య హత్య చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఎంపీటీసీ బజారయ్య పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. గత కొంతకాలంగా బజారయ్య, గంజి ప్రసాద్ మధ్య ఆధిపత్య పోరు నడుస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

## గోపాలపురం ఎమ్మెల్యేపై దాడి.. స్పందించిన హోంమంత్రి

విశాఖపట్నం: ఎండాడలో 'దిశ' పోలీస్ స్టేషన్‌ను హోం మంత్రి తానేటి వనిత శనివారం సందర్శించారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. మహిళల రక్షణ కోసమే దిశ యాప్, దిశ చట్టాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని హోంమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి 24 లక్షల మందికి పైగా దిశ యాప్ ను డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. చదువుకొనే ప్రతి విద్యార్థిని దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.మహిళలపై దాడులను సీఎం జగన్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరన్నారు. ఇటీవల మహిళలపై దాడులు చేయడం టీడీపీ నేతలకు అలవాటుగా మారిందన్నారు. వారే దాడులు చేసి వారే తిరిగి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. విశాఖ నగరంలో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన టీడీపీ నేత పై కేసు నమోదు చేశామన్నారు...ద్వారకా తిరుమల మండలం జి.కొత్తపల్లిలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావుపై జరిగిన దాడిపై ఆమె స్పందిస్తూ.. ఎమ్మెల్యేపై జరిగిన ఘటనపై వివరాలు తెలుసుకున్నానన్నారు. ఇప్పటికే తాను జిల్లా ఎస్పీతో మాట్లాడానని.. దాడి ఎందుకు జరిగిందన్న దానిపై పోలీసులు విచారణ జరుపుతున్నారన్నారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్లినప్పుడు ఎమ్మెల్యేపై దాడి జరిగిందన్నారు.



## బిగ్‌బాస్ లాంటి షోలతో యువత పెడదారి పడుతోంది: హైకోర్టు

అమరావతి: బిగ్‌బాస్ వంటి చెత్త రియాలిటీ షోల వల్ల యువత పెడదారి పడుతోందని ఏపీ హైకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి షోలతో సమాజంలో ప్రమాదకర పోకడలు పెరిగిపోతున్నాయంది. ఇలాంటి వాటిని ఎవరూ అడ్డుకోవడం లేదని, సమాజం ఎటుపోతోందో అర్థం కావడం లేదని అభిప్రాయపడింది. బిగ్‌బాస్ షోను నిలిపేయాలంటూ దాఖలైన వ్యాజ్యంపై వచ్చేనెల 2న విచారణ జరుపుతామని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ అసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు



ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎటువంటి సెన్సార్‌షిప్ లేకుండా ప్రసారం అవుతున్న బిగ్‌బాస్ వంటి కార్యక్రమాలు యువతను తప్పుదోవపట్టిస్తున్నాయని, ఈ కార్యక్రమాలను అడ్డుకోవాలంటూ తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి 2019లో హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.జగదీశ్వర్‌రెడ్డి తరఫు న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం జస్టిస్ అమానుల్లా నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. దీనిపై అత్యవసర విచారణ జరపాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. 'మంచి వ్యాజ్యం దాఖలు చేశారు. బిగ్‌బాస్ లాంటి చెత్త షోల వల్ల యువత జీవితాలు నాశనం అవుతున్నాయి. యువత పెడదోవ పడుతోంది. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో అసభ్యత, అశ్లీలతను పెంచేస్తున్నాయి. అనర్థాలకు దారితీసే ఈ కార్యక్రమాల వల్ల సమాజం పాడవుతుందన్న విషయాన్ని అందరూ గుర్తెరగాలి' అని వ్యాఖ్యానించింది.

## తిరుమల భక్తులకు గుడ్‌న్యూస్..

### టీటీడీ కీలక నిర్ణయాలు ఇవే..



తిరుమల: టీటీడీ పాలక మండలి సమావేశం ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన శనివారం తిరుమల అన్నమయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో పాలక మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. సామాన్య భక్తులకి త్వరగా దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. సర్వదర్శనం స్లాట్ విధానం ప్రారంభిస్తామని ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు.నడకదారి భక్తులకి దివ్యదర్శనం టికెట్ల కేటాయించాలని నిర్ణయం తీసుకున్నామని, మహారాష్ట్ర ప్రభుత్వం ముంబాయిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి పది ఎకరాల స్థలం కేటాయించారు. మహారాష్ట్ర మంత్రి ఆదిత్య ఠాక్రే నేడు స్థలానికి సంబంధించిన పత్రాలు అందించారు. దాదాపు 500 కోట్లు విలువ చేసే స్థలం. త్వరలోనే ముంబాయి లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేపడతాం. ఆలయ నిర్మాణానికి పూర్తి ఆర్థికంగా ఇవ్వడానికి గౌతమ్ సింఘానియా ముందుకొచ్చారని వైవీ సుబ్బారెడ్డి తెలిపారుశ్రీవారి మెట్టు మార్గం మే 5 నుంచి ప్రారంభంశ్రీవారి ఆలయం లో రెండు కొత్త బంగారు సింహాసనాలు తయారీకి ఆమోదం. పద్మావతి మెడికల్ కాలేజీలో రెండు బ్లాకుల నిర్మాణానికి 21 కోట్లు కేటాయింపు. మరో ఏడాదిలో శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి. విపత్తుల సమయంలో ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురికాకుండా కమిటి సూచనలు. అనేక ప్రాంతాలలో ఘాట్ రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలిరెండు విడతలుగా మరమ్మత్తులు.. 36 కోట్లు ఘాట్ రోడ్డు మరమ్మత్తులుతిరుమలలో బాలాజీ నగర్ ప్రాంతంలో ఎలక్ట్రిక్ చార్జింగ్ పాయింట్ ఏర్పాటుబయో గ్యాస్ ద్వారా అన్నప్రసాద కేంద్రం, లడ్డు తయారీకి ఉపయోగించాలని నిర్ణయంతిరుమల లోని టీటీడీ ఉద్యోగులు ఉంటే 737 కాటేజీలు మరమ్మత్తులు చేపట్టాలని నిర్ణయంధన రూపంలో ఇచ్చే విరాళాలు టీటీడీ అన్ని ప్రివిలేజ్ ఇస్తుంది.

# సంపాదకీయం

ఆదివారం ,01-05-2022

## పొంచి ఉన్న కరెంట్ ముప్పు

దేశవ్యాప్తంగా ఎండలు ఠారెత్తిస్తుంటే.. కరెంట్ కోతలు ప్రజలకు ప్రత్యక్ష నరకం కనబడుతోంది. బొగ్గు కొరత కారణంగా 12 రాష్ట్రాల్లో తీవ్ర కరెంట్ సంక్షోభం నెలకొంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండుతున్న ఎండల కారణంగా దేశవ్యాప్తంగా కరెంట్ డిమాండ్ విపరీతంగా పెరిగింది. యూపీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, బీహార్, జార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లో కరెంటు కోతలు జనాన్ని పరేషాన్ చేస్తున్నాయి కరెంట్ కోతలను అధిగమించే చర్యల్లో భాగంగా 657 ప్యాసింజర్ రైళ్లను నిరవధికంగా రద్దు చేశారు. విద్యుదుత్పత్తికి అవసరమైన బొగ్గును పవర్ ప్లాంట్లకు తరలించే క్రమంలో- బొగ్గుసరఫరా చేస్తున్న 400 రైల్ రేక్స్ ప్రయాణానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. దేశంలో 165 థర్మల్ పవర్ స్టేషన్లు ఉంటే, వాటిలో 56 పవర్ స్టేషన్లలో 10 శాతం, అంతకన్నా తక్కువ బొగ్గు నిల్వ ఉందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ చెబుతోంది. కనీసం 26 థర్మల్ స్టేషన్లలో 5 శాతం బొగ్గు నిల్వ ఉందని ఈ సంస్థ చెప్పడంతో డేంజర్‌బెల్స్ మోగుతున్నాయి.పవర్ డిమాండ్ 38 ఏళ్లలో కనీవినీ ఎరుగని రికార్డుస్థాయికి చేరింది. దేశవ్యాప్తంగా ఎండలు 122 ఏళ్లలో అత్యంత తీవ్రంగా ఉండటమే కారణం. కరెంట్ డిమాండ్‌కు సరిపడా సప్లయ్ లేకపోవడమే ఈ విద్యుత్ కోతలకు కారణం. మండే ఎండల్లో కరెంటు ఉత్పత్తి చేయడానికి సరిపడా బొగ్గు నిల్వలు మనదేశంలో లేవు. గుజరాత్‌లో పరిశ్రమలు వారానికి ఒకరోజు పవర్ హాలీడే ప్రకటించాయి. మహారాష్ట్రలో ఆరు నుంచి ఎనిమిది గంటలు పవర్ కట్ చేస్తున్నారు.కరెంట్ కోతలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు వెలువెత్తాయి. బొగ్గు కొరతను తీర్చేందుకు గత ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా సగటున రోజువారీ లోడింగ్ 400కుపైగా రేకలకు రైల్వే పెంచింది. ప్రస్తుత డిమాండ్‌కు అనుగుణంగా ఒక్కొక్కటి దాదాపు 3,500 టన్నులను కెపాసిటీ కలిగిన 415 బొగ్గు రేక్‌ల రవాణాకు కట్టుబడి ఉందని రైల్వే వర్గాలు తెలిపాయి. విద్యుత్ ప్లాంట్లలో నిల్వలను పెంచడానికి.. జులై-ఆగస్టులో వర్షాలతో బొగ్గు తవ్వకం తక్కువగా ఉన్నప్పుడు సంక్షోభాన్ని నివారించడానికి కనీసం మరో రెండు నెలల పాటు ఈ డ్రిల్ కొనసాగుతుందని తెలిపారు.దేశవ్యాప్తంగా పవర్ ప్లాంట్లు ఉన్నందున సుదూర రైళ్లను నడపాల్సి వస్తుందని, అందువల్ల పెద్ద సంఖ్యలో బొగ్గు రేకలు 3-4 రోజుల పాటు రవాణాలో ఉంటాయని ఓ అధికారి పేర్కొన్నారు. దేశీయ బొగ్గులో ఎక్కువ భాగం తూర్పు సెక్టార్ నుంచి ఉత్తర, మధ్య, పశ్చిమ ప్రాంతాలకు రవాణా జరుగుతోంది. అధికారిక సమాచారం ప్రకారం.. 2016-17లో రైల్వేలు ప్రతిరోజూ కేవలం 269 బొగ్గు రేక్‌లను మాత్రమే రవాణా చేశాయి.. 2017-18, 2018-19లో పెరిగింది. కానీ తర్వాత రెండేళ్లలో 267 రేక్‌లకు పడిపోయింది.. గతేడాది మళ్లీ పెరిగి రోజుకు 347 రవాణా జరిగింది.. ప్రస్తుతం ఈ సంఖ్య 400-405గా ఉంది. .ఈ ఏడాది బొగ్గుకు డిమాండ్ అనూహ్యమైన పెరుగుదల ఉందని అధికారులు తెలిపారు.దేశీయ విద్యుత్‌లో 70 శాతం థర్మల్ పవర్ ప్లాంట్‌ల నుంచి ఉత్పత్తి అవుతోంది. భారతీయ రైల్వేలు, ఫ్రైట్ కారిడార్ నెట్‌వర్క్‌లు రెండింటిలోనూ సుదూర రైళ్లను నడపడం, లోడింగ్, అన్‌లోడింగ్ పాయింట్‌ల వద్ద బొగ్గు రేక్‌ల పర్యవేక్షణ, రవాణాను పెంచడానికి రైల్వే అనేక చర్యలు తీసుకుంది. థర్మల్ పవర్ స్టేషన్లలో బొగ్గు కొరత కారణంగా పలు రాష్ట్రాలు విద్యుత్తు కోతలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఢిల్లీ, పంజాబ్, ఉత్తర్ ప్రదేశ్‌లో ఆసుపత్రులు, మెట్రో రైళ్లలో అంతరాయాలు ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఢిల్లీలోని మెట్రో రైళ్లు, హాస్పిటల్స్‌కు విద్యుత్ సరఫరా చేయడంలో ఎదురుదెబ్బ తగులుతుందని ఢిల్లీ ప్రభుత్వం హెచ్చరించింది.పంజాబ్‌లోని భటిండాలో కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. కరెంటు, నీళ్లు ఇవ్వాలని కేంద్రాన్ని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అటు జమ్ములో కూడా ఇవే డిమాండ్లతో కాంగ్రెస్ శ్రేణులు రోడ్డెక్కాయి. కేంద్రంపై బాణాలు ఎక్కుపెడుతూ మండుటెండలో ప్రదర్శన చేపట్టారు.కరెంట్ సంక్షోభంపై ఢిల్లీలో పాలిటిక్స్ ఊపందుకున్నాయి. ఢిల్లీలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడనుందని ఆప్ ప్రభుత్వం హెచ్చరించింది. ఢిల్లీ మెట్రోతో పాటు హాస్పిటళ్లకు కూడా విద్యుత్తు సరఫరాలో సమస్యలు ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు ఢిల్లీ ప్రభుత్వం తెలిపింది. దాద్రి-2, ఉంచాహర్ విద్యుత్తు కేంద్రాల నుంచి విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని, ఢిల్లీ మెట్రోతో పాటు ప్రభుత్వ హాస్పిటళ్లు, ఇతర కీలక కార్యాలయాలకు 24 గంటల విద్యుత్తును సరఫరా చేయడం సాధ్యం కాదని వెల్లడించింది. అయితే ఢిల్లీ ప్రభుత్వ వాదనలో నిజం లేదని ఎన్టీపీసీ అంటోంది. దాద్రి-2, ఊంచహార్ పవర్ ప్లాంట్స్‌కు క్రమబద్ధంగా నిత్యం బొగ్గు సరఫరా అవుతోందని, ఈ రెండూ పరిపూర్ణ సామర్థ్యంతో పని చేస్తున్నాయని తెలిపింది.

# ప్రీతి ఆదానికి రాజ్యసభ ?

విజయవాడ, ఏప్రిల్ 30,ఆంధ్రప్రదేశ్‌ లో ఒకేసారి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. రాష్ట్ర శాసన సభలో ఉన్నసంఖ్యాబలం కారణంగా ఈ నాలుగు స్థానాలు వైసీపీకే దక్కనున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఈ వారంలోనే ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. అదలా ఉంటే,ఈ నాలుగు స్థానాలకు అభ్యర్ధులను ఖరారు చేసే పనిలో ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి మంతనాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పటికే ఒక సీటు, బిజినెస్ కోటాలో, ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ భార్య ప్రీతి అదానీకి రిజర్వు అయినట్లు పార్టీ వర్గాల సమాచారం. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఈ విషయాన్ని కూడా ఢిల్లీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు. గత ఎన్నికల్లో ఇదే బిజినెస్ కోటాలో రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీకి సన్నిహితుడు, రిలయన్స్ సంస్థల వైస్‌ప్రెసిడెంట్ పరిమళ్ నత్వానీకి వైసీపీ తరఫున రాజ్యసభ టికెట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే విధంగా మరో పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ భార్య ప్రీతి అదానీని రాజ్య సభకు పంపడం ఖాయంగా కనిపిస్తోంది. అదలా ఉంటే, వైసీపీపీ నేత, జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి రాజ్యసభ పదవీ కాలం జూన్ మొదటివారంలో ముగుస్తోంది.ఆయనకు రెండోసారి కూడా అవకాశమిచ్చేందుకు జగన్ రెడ్డి సుముఖంగా లేరని సమాచారం. అయితే, మాయల పకీరు ప్రాణం చెట్టు తొర్రలో ఉన్నట్లు, జగన్ రెడ్డి గుట్టుమట్లన్నీ విజయసాయి గుప్పిట్లో ఉన్నాయని, అందువలన చేత పార్టీ పునర్వ్యవస్తీకరణలో ప్రయోగించిన, 'బ్లాక్ మెయిల్' అస్త్రాన్ని విజయ సాయి మళ్ళీ ప్రయోగిస్తే ముఖ్యమంత్రి ఏమి చేస్తారనేది అనుమానమే అంటున్నారు. విజయసాయి వ్యవహారం ఎలా ఉన్నా ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఒకరిని, కమ్మ సామాజిక వర్గం నుంచి ఒకరినీ పెద్దల సభకు పంపాలనే నిర్ణయానికి వచ్చారని, పార్టీ వర్గాల సమాచారం. ఎస్సీ సామాజిక వర్గం నుంచి బీద మస్తాన్ రావు, డొక్కా మాణిక్య వర ప్రసాద్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.ఈ ఇద్దరిలో ఒకరికి రాజ్య సభ టికెట్ ఖాయమని అంటున్నారు. ఇటీవల మంత్రి వర్గ విస్తరణలో కమ్మ సామాజిక వర్గానికి మొండి చేయి చూపించి, విమర్శలు ఎదుర్కుంటున్న ముఖ్యమంత్రి, చిలకలూరి పేట మాజీ ఎమ్మెల్యేమర్రిరాజశేఖర్'కురాజ్యసభ టికెట్ఇచ్చే అవకాశం ఉందని,అంటున్నారు. నిజానికి జగన్ రెడ్డి తెలుగు దేశం పార్టీనుంచి వచ్చిన విడదల రజనీని చిలకలూరి పేట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్ధిగా ప్రకటించిన సమయంలోనే, రాజశేఖర్' కు ఎమ్మెల్సీ, మంత్రి పదవి ప్రామిస్ చేశారు. అయితే, ఆతర్వాత అలవాటులో పొరపాటుగా, మాట తప్పారు. మడమ తిప్పారు. ఇప్పుడు, రాజకీయ అవసరాల దృష్ట్యా ముఖ్యమంత్రి ఆయనకు రాజ్యసభ టికెట్ ఇచ్చి, కమ్మ సామాజిక వర్గాన్ని సంతృప్తి పరిచే అలోచన చేస్తున్నారని అంటున్నారు. మరోవంక వైసీపీలో సహజంగానే, పైసా ఖర్చు లేకుర్న పెద్దల సభకు వెళ్ళే అద్భుత అవకాశం కోసం సజ్జల సహా చాలా మందేపోటీ పడుతున్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యక్తిగత న్యాయవాది నిరంజన్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఇంకా మరి కొందరు కూడా రేసులో ఉన్నారని అంటున్నారు.అదే సమయంలో, ఎవరూ ఊహించని పేర్లు ఉన్నా ఆశ్చర్య పోనవసరం లేదని, అంటున్నారు.

# వడివడిగా అమరావతి పనులు

విజయవాడ, ఏప్రిల్ 30,అసంపూర్తిగా ఉన్న సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికె), హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీ తదితర భవన నిర్మాణాలను ఈ ఏడాదిలోనే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంటు నిధులతో చేపట్టిన పలు భవనాల నిర్మాణాలు రెండేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అన్ని భవనాలనూ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఇటీవల కలెక్టర్లు, ఎస్‌పిలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఉపాధి పథకంలో వీలైనంత ఎక్కువ మట్టి పని చేయడం ద్వారా ఎక్కువ మొత్తంలో మెటీరియల్ నిధులను మంజూరయ్యేలా చూడాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు సూచించారు. గతేడాదితో పోల్చితే రాష్ట్రానికి 50 శాతం పని దినాలు (మ్యాన్ డేస్) తగ్గినప్పటికీ, మూడు నెలల్లోనే వాటిని సద్వినియోగం చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఆ మేరకు ఉపాధి పథకం అధికారులు జిల్లాల వారీ ఉపాధి పని దినాల ప్రణాళికను రూపొందించారు. ప్రతి జిల్లాలోనూ రోజుకు లక్ష పని దినాల చొప్పున నెలకు కనీసం 25 లక్షల పని దినాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఉపాధి కింద 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం 14 కోట్ల మ్యాన్ డేస్‌ను మంజూరు చేసింది. ఇందులో ఈ నెలలో 2.10 కోట్ల పని దినాలకుగానూ ఇప్పటి వరకు 2.04 కోట్ల పని దినాలను కల్పించినట్లు అధికారులు తెలిపారు. మే నాటికి 7.70 కోట్లు, జూన్ నాటికి 12 కోట్ల పని దినాలను పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళికను అధికారులు రూపొందించారు. ఉపాధి పనుల్లో ఎంతమేర మట్టి పని జరిగితే మెటీరియల్ నిధులు అంత ఎక్కువగా విడుదలవుతాయని అధికారులు చెబుతున్నారు. ఆ నిధులతో అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు, ఆర్‌బికె, డిజిటల్ లైబ్రరీలు, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లు, వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు వీలుంటుందంటున్నారు.గతేడాది ఉపాధి మెటీరియల్ కింద రాష్ట్రానికి సుమారు రూ.3,340.54 కోట్లు రావాల్సి ఉండగా, రూ.1,943.88 కోట్లే మంజూరయ్యాయి. మిగిలిన నిధులను ఈ నెలాఖరులోగా మంజూరు చేయించేందుకు ఉపాధి పథకం అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖకు లేఖ రాయనున్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరం లేబర్ బడ్జెట్ ప్రకారం రాష్ట్రానికి రూ.2,504 కోట్ల మెటీరియల్ నిధులను కేంద్రం మంజూరు చేసింది. అందులో మూడు విడతల్లో రూ.1943.88 కోట్లు మంజూరయ్యాయి.మెటీరియల్ నిధులు ఇంకా రూ.835.99 కోట్లు రావాల్సి ఉంది. మెటీరియల్ నిధులతో 44,119 సచివాలయ, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్స్, డిజిటల్ లైబ్రరీ తదితర భవన నిర్మాణాలకు 28,989 గ్రౌండింగ్ అవ్వగా, వాటిలో ఇప్పటి వరకు 7,809 మాత్రమే పూర్తయ్యాయి. చేసిన పనులకు బిల్లులు మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టర్లు నిర్మాణాలను ఆపేశారు. ఈ నెలాఖరులోగా బకాయిలను విడుదల చేయించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సాక్షాత్తు సిఎం వైఎస్ జగన్ ఆదేశించారు. దీంతో డిప్యూటీ సిఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు ఉపాధి పనులు, పెండింగ్ బకాయిలపై అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

# రాజమహేంద్రవరాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుదాం



### ప్రతి ఒక్కరూ నగర సుందరీ కరణకు సహకరించాలి

### కలక్టరు డా. కే. మాధవీలత

రాజమండ్రి నూతన తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కేంద్రమైన "రాజమహేంద్రవరాన్ని" స్వచ్ఛనగరంగా తీర్చి దిద్దేందికు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టరు డా. కె. మాధవీలత అన్నారు. శనివారం ఉదయం స్థానిక వై. జంక్షన్ వద్ద ఎన్జీఓలు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వై జంక్షన్ నుంచి లాలాచెరువు వరకు చేపట్టిన స్వచ్ఛ సంకల్పం, శ్రమ దానం కార్యక్రమంలో జిల్లా కలెక్టరు కె. మాధవీలత, నగరపాలక సంస్థ కమిషనరు కె. దినేష్ కుమార్ ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు డా.మాధవీలత మాట్లాడుతూ , నూతనంగా ఏర్పడిన జిల్లాలో ప్రధాన కేంద్రమైన రాజమహేంద్రవరం నగరానికి సాంస్కృతిక నగరంగా మంచి పేరు ఉందన్నారు. మన జిల్లాలో ఉన్న ఏకైక పెద్దనగరం అన్నారు. కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని అన్నారు. జిల్లాను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు నగర వాసులు సహకరించాలని, ఈ దిశలో ప్రజా ప్రతినిధులు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వచ్ఛ సంకల్పప్రతి ఇంటికి తడి పొడి చెత్తను సేకరించేందుకు నగరపాలక సంస్థ రెండు డస్ట్ బిన్నులను అందించిందన్నారు. నగరవాసులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేరు వేరు డస్ట్ బిన్నులో వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించి కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. దేశంలోనే రాజమహేంద్రవరంకు మంచి పేరుఉందని, అందరం కలిసి కట్టుగా పనిచేసి "స్వచ్ఛ రాజమహేంద్రవరం" సాధన లో భాగంగా స్వచ్ఛనగరంగా తీర్చిదిద్దుదామన్నారు. తొలుత క్లీన్ అండ్ గ్రీన్ లో భాగంగా కలెక్టరు స్వయంగా అధికారులతో కలసి చెత్త సేకరణ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యారు. అందులో భాగంగా చెత్త సేకరణ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఇది ఆరంభం మాత్రమేనని , నిరంతర ప్రక్రియగా కొనసాగించేందుకు స్వీయ భాగస్వామ్యం ద్వారా మాత్రమే సాధ్యం అవుతుందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా జిల్లాకలెక్టరు వారి నేతృత్వంలో స్వచ్ఛ సంకల్పం శ్రమదానం కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టామన్నారు. గత 15 రోజులుగా ఇంటింటి ప్రచారం ద్వారా ప్రజల్లో అవగాహన కోసం ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందరం చేయిచేయి కలిపి రాజమహేంద్రవరాన్ని చెత్త రహిత నగరంగాతీర్చి దిద్దుదామని కోరారు. కార్పోరేషన్ నుంచి ప్రతి ఇంటికి చెత్త సేకరణకు వాహనం వస్తుందని ఆవాహనం వచ్చినప్పుడు మీఇంటి లోని తడి, పొడి చెత్తను విడివిడిగా ఇచ్చి సహరించాలన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దేందుకు ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆర్ఎంసి , ఇతరశాఖల అధికారులు, సిబ్బంది ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గంజి ప్రసాద్ హత్య కేసులో నిందితుల లొంగుబాటు

ఏలూరు ఏలూరు జిల్లా జి.కొత్తపల్లిలో వైసీపీ నేత గంజి ప్రసాద్ హత్య కేసు ఊహించని మలుపు తిరిగింది. పోలీస్?స్టేషన్?లో నిందితులు స్వచ్ఛందంగా లొంగిపోయారు. ఈ హత్యను తామే చేశామంటూ సురేష్, మోహన్, హేమంత్?లు పోలీస్ స్టేషన్లో లొంగిపోయారు. నిందితులు ముగ్గురూ ఎంపీటీసీ సభ్యుడు బజారియా వర్గీయులు కావడం గమనార్హం. హతుడు గంజి ప్రసాద్?కు, బజారియాకు మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. ఒకవైపు ఈ హత్య.. వైసీపీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావే చేయించాడంటూ వైసీపీ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే.. మృతుడు గంజి ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు రాగా.. ఆయనపై గ్రామంలోని వైసీపీ కార్యకర్తలంతా మూకుమ్మడిగా దాడికి పాల్పడిన కొద్ది నిమిషాల్లోనే నిందితులు లొంగిపోవడం గమనార్హం.

## పార్టీల రహితంగా సంక్షేమం

నెల్లూరు సిటీ నియోజకవర్గం సున్నా వడ్డీ రుణాల పంపిణీలో మాజీ మంత్రి అనీల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. 3326 స్వయం సహాయక గ్రూపులకు 3 .53 కోట్ల రూపాయల చెక్కు అందచేసారు. అనీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మహిళలకు సీఎం వైఎస్ జగన్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. పార్టీల రహితంగా సంక్షేమం అందిస్తున్నారు. కరోనా కష్టాల్లో కూడా పథకాలు కొనసాగించిన గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్. సీఎం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను తమిళనాడు కూడా అనుసరిస్తోంది. టీడీపీ నేతలు మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

# ఏపీలో మ్రోగుతున్న డేంజర్ బెల్స్

విజయవాడ, ఏప్రిల్ 30,విద్యుత్ కోతలు వేధిస్తున్నప్పటికీ.. ప్రత్యామ్నాయ చర్యలపై మాత్రం అధికారులు దృష్టి సారించలేకపోతున్నారు. ప్రధానంగా విద్యుదుత్పత్తికి కావాల్సిన బొగ్గును సమకూర్చుకోవడంలో, విద్యుత్ కొనుగోలుకు సంబంధించిన నిధులను చెల్లించడంలో ఇంధనశాఖ అధికారులు విఫలమౌతున్నారు. ఈ నేపథ్యంలోనే డబ్బులు ఇవ్వకపోతే బొగ్గు సరఫరా నిలిపివేస్తామంటూ సింగరేణి, మహానంది యాజమాన్యాలు హెచ్చరికలు చేస్తుంటే, లెటర్ ఆఫ్ క్రెడిట్ కింద నగదు చెల్లింపులు జరగకపోతే విద్యుత్ సరఫరా ఆపివేస్తామంటూ ఎన్‌టిపిసి కూడా తాఖీదులు పంపిస్తోంది.ఈ వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని అంచనా ఉన్నా, ఆ డిమాండ్‌ను అందుకునే ముందస్తు ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేయలేదు. ఫలితంగా ప్రజలు అప్రకిత విద్యుత్ కోతలతో సతమతమవుతున్నారు. కనీసం రెండు నెలలకు సరిపడా బొగ్గును నిల్వ ఉంచుకోవలసి ఉండగా ఆ దిశలో కూడా చర్యలు తీసుకోలేదు. అందువల్లనే బొగ్గు కంపెనీలకు పెద్ద మొత్తంలో బకాయిలు పడిపోయింది రాష్ట్ర ప్రభుత్వం. ప్రతి నెలా బొగ్గు కోసం చెల్లించాల్సిన బకాయిలపై రాష్ట్ర ఇంధనశాఖకు లేఖలు వస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ బకాయిలు సకాలంలో చెల్లించలేకపోతున్నారు.తాజా వివరాల మేరకు ఒక్క మహానంది కోల్ సంస్థకే 401 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది. దీనిపై నిధులు కావాలని పదేపదే ఆర్థికశాఖను ఇంధన శాఖ అధికారులు కోరుతున్నప్పటికీ నిధుల కేటాయింపులు జరగడం లేదు తాజాగా ఎన్‌టిపిసి కూడా బకాయిలపై లేఖలు రాసింది. రాష్ట్ర పవర్ కోఆర్డినేషన్ సంస్థ నుంచి రూ.1109 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇందులో రూ.355 కోట్లు ఇప్పటికే ఓవర్‌డ్యూస్‌గా మారిపోనున్నాయి. ఈ బకాయిలను 29వ తేదీలోగా చెల్లించకపోతే నిరంతర విద్యుత్ సరఫరా కష్టమేనని ఎన్‌టిపిసి అధికారులు చెబుతున్నారు. బకాయిలు తీర్చేందుకు నిధులు అందుబాటులో లేకపోవడం వల్లనే ఎన్‌పిఏకు చివరి క్షణాల్లో చెల్లింపులు జరుగుతున్నాయని అధికారులే అంగీకరిస్తున్నారు. అంటే ఒక నెలలో చెల్లించాల్సిన బకాయిలను మూడు నెలలకు చెల్లిస్తున్నట్లు కనిపిస్తోంది.

## కాఫీ రైతులకు కానరాని ప్రోత్సాహం

విశాఖపట్టణం, ఏప్రిల్ 30, అరకు కాఫీ అంతర్జాతీయంగా ఖ్యాతి గడించినప్పటికీ దాన్ని పండించిన గిరిజన రైతుకు మాత్రం ప్రోత్సాహం కరువైంది. మార్కెట్‌లో లభించిన గుర్తింపు, ప్రతిఫలం గిరిజనులకు దక్కడం లేదు. గిరిజన సహకార సంస్థ (జిసిసి) ఆశించిన స్థాయిలో కాఫీ గింజలను కొనుగోలు చేయకపోవడంతో నాంది, టాటా వంటి ప్రయివేటు సంస్థలు ఏజెన్సీలో నాటుకుపోయాయి. జిసిసి కంటే కాస్త ఎక్కువ ధరను చెల్లించడంతో అత్యధిక భాగం కాఫీ గింజలు ఆ సంస్థలే కొనుగోలు చేస్తున్నాయి. ప్రయివేటు సంస్థలకు ధీటుగా ధర చెల్లించి కాఫీ గింజలు కొనుగోలు చేసి మార్కెటింగ్ చేసుకొనే అవకాశం జిసిసికి ఉన్నప్పటికీ ఆ ప్రయత్నం చేయడంలేదు. ప్రభుత్వం నుంచి సరైన సహకారం, ప్రోత్సాహం లేకపోవడంతో జిసిసి మార్కెట్ పోటీకి అనుగుణంగా ముందుకు వెళ్లలేకపోతోంది.అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలోని కొయ్యూరు, అనంతగిరి, అరకు, పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, జికె.వీధి, చింతపల్లి మండలాల్లోని 1.58 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. దాదాపు 1.54 లక్షల మంది రైతులు కాఫీ పంట సాగు చేస్తున్నారు. రూ.200 కోట్లకుపైగా విలువైన 11 వేల మెట్రిక్ టన్నుల కాఫీ పండుతోంది. దీనిలో ఈ ఏడాది రెండు వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలు కొనుగోలు చేయాలని జిసిసి నిర్ణయించి, 627 మంది రైతుల నుంచి 2.40 కోట్ల విలువైన 135 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసింది. కాఫీ కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న జిసిసి మార్కెట్‌లో ప్రయివేటు సంస్థలు చెల్లించిన ధరను రైతులకు ఇవ్వలేకపోయింది. దీంతో ప్రయివేటు వ్యాపారులకు రైతులు అమ్ముకుంటున్నారు. సీజన్ అర్ధ భాగంలో పార్చ్‌మెంట్, అరబిక చెర్రీ గింజలకు జిసిసి ధర పెంచినా లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ప్రయివేటు సంస్థలు, జిసిసి చెల్లిస్తున్న ధరకు మధ్య వ్యత్యాసం ఉండడంతో జిసిసి 135 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగలిగింది. కిలో అరబిక పార్చ్‌మెంట్ కాఫీ గింజలకు ప్రయివేటు వ్యాపారులు రూ.280 చెల్లిస్తున్నారు. ఆ ధరను జిసిసి రూ.180 నుంచి రూ.260 పెంచినా రూ.20 వ్యతాసం ఉండడంతో ప్రయివేటు వ్యాపారులకే గిరిజనులు అమ్ముకున్నారు. అరబిక చెర్రీ కాఫీకి ప్రయివేటు వ్యాపారులు కిలోకు రూ.125 చెల్లిస్తున్నారు. దీనికి తొలుత జిసిసి రూ.75 చెల్లించి, తరువాత రూ.110 పెంచింది. ప్రయివేటు వ్యాపార సంస్థలు చెల్లిస్తున్న ధరకు దగ్గరగా సీజన్ చివరిలో జిసిసి ధర పెంచింది. అప్పటికే ప్రయివేటు వ్యాపార సంస్థలు రైతుల నుంచి కొనుగోలు చేయడంతో జిసిసి తన లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ప్రయివేటు సంస్థలు చెల్లిస్తున్న ధరకు తగినట్లు జిసిసి ధర పెంచి చెల్లించేలా కాఫీ ఎపెక్స్ కమిటీ సీజన్ ఆరంభంలో నిర్ణయం తీసుకుంటే లక్ష్యాన్ని చేరుకున్నది.

## మూడేళ్లుగా పరువు పోతోంది...

నెల్లూరు, ఏప్రిల్ 30, మూడేళ్లుగా ఏపీలో పాలన ఎంత అధ్వాన్నంగా జరుగుతోందో అందరికీ తెలుసు. ఎవరిని అడిగినా.. జగన్ పాలన కష్టాలు ఏకరువు పెడతారు. అధికారపక్షం మాత్రం అలాంటిదేమీ లేదంటూ.. సంక్షేమ పథకాల పేర్లు చెప్పి సమస్యలను కప్పెడుతోంది. అయితే, వైసీపీ ఎమ్మెల్యే ఆనం రాంనారాయణరెడ్డి మాత్రం అలా కాదు. అధికార పార్టీలో ఉన్నా.. పాలనలో తప్పులను, ప్రభుత్వ పొరబాట్లను, సొంతపార్టీ నేతల ఆగడాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రజల కోసం.. లోటుపాట్లపై తన వాయిస్‌ను బలంగా వినిపిస్తూనే ఉన్నారు. తాజాగా, సీఎం జగన్‌ను తప్పుదారి పట్టిస్తున్నారంటూ వైసీపీ నేతలు, అధికారులపై మండిపడ్డారు ఆనం. ఆయన చేసిన వ్యాఖ్యలు ఏపీలో అలజడి రేపుతున్నాయి. సీఎం జగన్‌కు అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చి ఆయనతో తప్పుడు స్టేట్‌మెంట్లు ఇప్పిస్తున్నారంటూ మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోలులో వెనుకబడ్డామని.. సమస్యలు అలాగే ఉన్నాయని విమర్శించారు. సోమశిల కాలువలు సరిగా లేవని.. చివరి వరకు నీరు పోవడం లేదని అసలు వాస్తవం చెప్పారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంత్రిగా వచ్చారని.. ఆయన అయినా మాట వింటారని అనుకుంటున్నామని ఆనం అన్నారు. ముఖ్యమంత్రి మాటలను ఇక్కడి పాలకులు అబద్ధాలు చేస్తున్నారని.. నెల్లూరు, సంగం వంతెనలు ప్రారంభిస్తామంటూ అధికారులు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఆరోపించారు. నీటిపారుదలశాఖ అధికారులు సీఎంవోకి వాస్తవాలు చెప్పాలన్నారు. మూడేళ్లుగా 20 శాతం కూడా పనులు చేయలేకపోతున్నారని.. పరువుపోతోందని ఆనం ఆగ్రహం వ్యక్తం చేశారు. తన మాటలతో మేడిపండు లాంటి జగన్ పాలన డొల్లతనం పబ్లిక్‌గా బయటపెట్టారు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి.

# మంగళగిరిలో గిరి గీసీ మరీ....లోకేష్



గుంటూరు, ఏప్రిల్ 30, పోగొట్టుకున్న చోటే వెతకాలి' ఇది పెద్దలు చెప్పిన మాట. కానీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నారా లోకేష్ వెతకడమే కాదు ఏకంగా వేట మొదలెట్టేశారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైన మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంపై ఆయన పూర్తి పట్టు సాధించడం కోసం తీవ్రంగా కృషిచేస్తున్నారు. ప్రతినిత్యమూ ప్రజల మధ్యనే ప్రజల్లోనే ఉండి ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తున్నారు. జగన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ సర్కార్ హయాంలో ఏపీ వ్యాప్తంగా ప్రజలకు ఎక్కడ ఏ సమస్య ఎదురైనా వేగంగా స్పందిస్తున్నారు. బాధిత ప్రజలకు మద్దతుగా నిలుస్తున్నారు. అందుకే, లోకేశ్ దూకుడు వైసీపీకి ముచ్చెమటలు పట్టిస్తోంది. చినబాబు తుమ్మపూడిలో అడుగుపెడితే.. ఆర్కే అనుచరులు రాళ్ల దాడికి ప్రయత్నించారు. ఎస్ఐ తలపగలగొట్టారు. ఇలా రౌడీల్లా రెచ్చిపోతే.. కుక్కల్లా మొరిగితే.. లోకేశ్ భయపడిపోతారని అనుకున్నట్టున్నారు. కానీ, అక్కడ ఉన్నది నారా లోకేశ్. రాళ్ల దాడి జరిగినా.. అదరలేదు.. బెదరలేదు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి.. రాళ్ల దాడిపై అదే రేంజ్‌లో స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. న్యాయం జరగకపోతే 15 రోజుల్లో మళ్లీ వస్తానంటూ సవాల్ చేశారు. దటీజ్ లోకేశ్. లోకేష్ తన స్టైల్ మార్చారు. ప్రసంగాల్లో వాడీ వేడీ పెంచారు. అధికార పార్టీపైన నిశితంగా విమర్శలు చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై మరింత అవగాహనతో మాట్లాడుతున్నారు. 'సమయం లేదు మిత్రమా? ఇంకా రెండేళ్లే ఉంది.. ప్రజల్లోకి వెళ్లాలి' అంటూ వచ్చే ఎన్నికలకు టీడీపీ శ్రేణులను సమాయత్త పరుస్తున్నారు. చినబాబు లోకేష్ స్పీడును చూసి టీడీపీ శ్రేణులే అవాక్కవుతున్నాయి. మా చినబాబు కెవ్వు కేక అంటూ సంబరపడిపోతున్నారుచినబాబు లోకేష్ చాలా రోజులుగా నిత్యం మంగళగిరి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. నియోజకవర్గం ప్రజల కష్టనష్టాల గురించి తెలుసుకుంటున్నారు. వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై తీక్షణమైన విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రజా సమస్యలపై తాము పోరాటం చేస్తుంటే.. ఎమ్మెల్యేగిరీ చేతిలో పెట్టుకుని ఆళ్ల కొన్ని ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్లిపోతున్నారని నిప్పులు చెరుగుతున్నారు. నియోజకవర్గం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆళ్ల విఫలమైన వైనాన్ని జనానికి అర్థమయ్యేలా చెబుతున్నారు. చంద్రబాబు లాంటి విజనరీ కావాలా? జగన్ లాంటి ప్రిజనరీ కావాలా? ప్రజలే నిర్ణయించుకోవాలని అంటున్నారు. జనరంజకంగా పాలన సాగించిన రాముడు లాంటి చంద్రబాబు కావాలా? నిత్యావసర వస్తువుల ధరలు పెంచుకుంటూ పోతున్న రాక్షసుడు లాంటి జగన్ కావాలా? నిర్ణయించుకోండంటున్న లోకేష్ మాటలు జనంలోకి బాగా వెళుతున్నాయిప్రజా సమస్యలపై వేగంగా స్పందిస్తున్న లోకేష్ జంగారెడ్డిగూడెం కల్తీసారా మరణాలపై వైసీపీ సర్కార్ ను దుమ్మెత్తిపోశారు. రాజకీయ లబ్ధి కోసం తల్లిని, చెల్లిని పక్క రాష్ట్రానికి తరిమేసిన జగన్ కు నవ్వుతూ అబద్ధాలాడడం అలవాటంటూ తూర్పారపడుతున్నారు. సొంత బ్రాండ్లతో జనం జేబులు, ఆరోగ్యాలను గుల్ల చేస్తున్న వైసీపీ సర్కార్ తీరును ఎద్దేవా చేస్తూ జగన్ రెడ్డి చిత్రపటానికి మద్యంతో అభిషేకం చేయడం అందర్నీ ఆకర్షించింది. జేబ్రాండ్ మద్యం మరణాలపై న్యాయ విచారణకు లోకేష్ డిమాండ్ చేశారు. పెగాసస్ సాఫ్ట్ వేర్ ను టీడీపీ హయాంలో కొనుగోలు చేసి ఉంటే నిరభ్యంతరంగా తమపై చర్యలు తీసుకోవచ్చని జగన్ సర్కార్ ను ఛాలెంజ్ చేస్తున్నారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని టీడీపీ విధానం అని చెబుతూనే.. అభివృద్ధి వికేంద్రీకణ జరగాలని, పరిపాలన కేంద్రీకృతంగా ఉండాలని చెబుతున్నారు. ఏపీ రాజధానిని మూడు ముక్కలాటగా మార్చేసిన జగన్ సర్కార్ తీరుపై లోకేష్ చెప్పిన ఈ మాటలు ఆయన పరిపక్వతకు నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మూడేళ్లలో ఒక్క పరిశ్రమను తీసుకురాలేని వైసీపీ.. ఇప్పుడు జిల్లాల విభజన చేస్తే అభివృద్ధి జరుగుతుందా? అని ఘాటుగా ప్రశ్నించారు. విశాఖను రాబందుల్లా వైసీపీ నేతలు పీక్కు తింటున్నారని దుమ్మెత్తిపోశారు. వైసీపీ కబ్జా కోరల నుంచి విశాఖను రక్షించుకుందామని లోకేష్ పిలుపునివ్వడమే కాకుండా.. బాధితులకు అండగా తాము ఉంటమని భరోసా ఇస్తున్నారు. ఏపీలో విద్యుత్ సమస్యపై స్పందిస్తూ.. 2019 ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలు, ప్రస్తుతం చేస్తున్న పనులను ఉదహరిస్తూ 'జనం చెవిలో జగన్ పూలు' ఏప్రిల్ 1న విడుదల అంటూ సెటైరికల్ వీడియో విడుదల చేశారు. చీటికి మాటికి ఢిల్లీ వెళ్తున్న జగన్ టూర్ దేని కోసం అంటూ.. 'పేలని జ'గన్' హస్తిన పయనమెందుకు అంటూ లోకేష్ ట్విట్టర్ లో పెట్టిన పోల్ బాగా వైరల్ అయింది. 'అసూయకు మందు లేదు.. అసూయతో ఉంటే త్వరగా గుండెపోటు, బీపీలు వస్తాయి' అన్న జగన్ కు లోకేష్ ట్విట్టర్ వేదికగా 'అసూయకు అన్నలాంటి వాడు సీఎం జగన్' అంటూ గట్టి కౌంటరే ఇవ్వడం గమనార్హం. 'వెంట్రుక కూడా పీకలేరు' అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలకు అంతే స్పీడుగా కౌంటర్ వేయడం లోకేష్ లోని స్పీడుకు నిదర్శనం అంటున్నారు. 'గల్లీ నుండి ఢిల్లీ వరకూ పనికిమానిలోడని తెలిపోయిన తర్వాత ఫ్రస్టేషన్ కాకపోతే ఫన్ వస్తుందా?.. మీ వెంట్రుకలు పీకే ఓపిక, తీరిక మాకు లేవు.. మీ నవరంధ్ర పాలన నుంచి ప్రజలను ఎలా గట్టెంకించాలనే ఆలోచనతో మేం పనిచేస్తున్నాం.. ప్రజలే మీ వెంట్రుకలు పీకడానికి, గుండు కొట్టించి, పిండిబొట్లు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు' అని కౌంటర్ వేశారు. ఒక వైపున ట్విట్టర్ వేదికగా ప్రభుత్వం చేసే తప్పులను ఎత్తి చూపుతూనే మరో పక్కన జగన్ కు వివిధ అంశాలపై లోకేష్ లేఖలు రాస్తున్నారు. ఏపీలో ఇటీవల విధించిన పవర్ హాలిడే ఎత్తేయాలంటూ జగన్ కి లేఖ రాశారు. విద్యుత్ రంగాన్ని నాశనం చేసి, ఏపీని అంధకారంలో నెట్టేయడం సరికాదని తప్పుపట్టారు. ఏపీలోని ధాన్యం రైతుల దైన్యంపైన కూడా జగన్ కు లోకేష్ లేఖ రాశారు. రైతుల నుంచి మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అమ్మ ఒడి' లబ్ధిదారులకు నిబంధనలు పెట్టిన తీరుపై లోకేష్ సెటైర్లు వేశారు. 'కన్న తల్లికి అన్నం పెట్టనోడు.. పినతల్లికి బంగారు గాజులు చేయిస్తానన్నట్లు ఉంది జగన్ అమ్మ ఒడి పథకం తీరు' అని సెటైర్ వేశారు. 'అమ్మ ఒడిని అర్ధ ఒడి' చేశారని దుయ్యబట్టారు. ఏపీలో జగన్ రెడ్డి ఏలుబడిలో బాలికలు, యువతులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై లోకేష్ స్పందించారు. ఆస్పత్రుల ప్రైవేట్ అంబులెన్స్ ల దందాపై స్పందిస్తూ.. చేతగాని పాలకుడు జగన్ చెత్త పాలన కారణంగానే రుయా ఆస్పత్రి నుంచి తన కొడుకు మృతదేహాన్ని ఓ తండ్రి బైక్ పై తీసుకెళ్లిన దుస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. ఏపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా టీడీపీ చేపట్టిన 'బాదుడే బాదుడు' నిరసనలో భాగంగా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లిలో ప్రజలకు విసనకర్ర, కొవ్వొత్తి, అగ్గిపెట్టి పంపిణీ చేశారు. గత ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఇళ్లపట్టాలు ఇస్తానని హామీ ఇచ్చిన మంగళగిరి ఎమ్మెల్యే ఇళ్ల పట్టాలు ఇవ్వకపోగా ప్రజలపై కక్షకట్టి ఇళ్లు కూల్చేస్తున్నారని ధ్వజమెత్తారు. ట్విట్టర్ వేదికగా వైసీపీ సర్కార్ ను అనుక్షణం నిలదీస్తూనే, మరో పక్కన ప్రజలతో మమేకం అవుతున్నారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వానికి, సీఎం జగన్ కు లేఖలు రాస్తున్నారు. మొత్తం మీద పార్టీని గెలుపు బాటలో నడిపించేందుకు చేయాల్సిన కృషి చేస్తూనే.. మంగళగిరిపై మరింత పట్టు పెంచుకునేందుకు కూడా లోకేస్ మరింత వేగంగా అడుగులు వేస్తున్నారు. రాళ్ల దాడులు జరిగినా.. తగ్గేదేలే.. వైసీపీ అరాచకాలకు బెదిరేదేలే.. జగన్ అండ్ కో ను వదిలేదేలే అంటున్నారు.

# రోజా..డబుల్ గేమ్

తిరుపతి, ఏప్రిల 30, కేటీఆర్ కామెంట్లు ఏపీలో కాక రేపుతున్నాయి. పక్క రాష్ట్రంలో కరెంట్ ఉండదు.. నీళ్లు ఉండవు.. రోడ్లు అధ్వానం అంటూ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో వైసీపీ నేతలు ఉలిక్కిపడ్డారు. మంత్రులంతా పోలోమంటూ కౌంటర్ ఇస్తూ డ్యామేజ్ కంట్రోల్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. పెద్దిరెడ్డి, జోగి రమేశ్, బొత్స, రోజా.. ఇలా మంత్రులంతా ఎవరికి తోచిన బాషలో వాళ్లు మా ఏపీ గొప్ప.. అంటూ కవర్ చేస్తున్నారు. ఇక రోజా అయితే సంథింగ్ డిఫరెంట్. ఓ వైపు కరెంట్ మంటలు సెగలు పుట్టిస్తుంటే.. రోజా మాత్రం నేరుగా ప్రగతిభవన్ వెళ్లారు. సీఎం కేసీఆర్‌ను కుటుంబ సమేతంగా కలిశారు. తనకు మంత్రి పదవి వచ్చినందుకు ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. కట్ చేస్తే.. ప్రగతి భవన్ నుంచి బయటకు రాగానే.. కేటీఆర్‌కు కౌంటర్ వేసి మరింత కామెడీ చేశారు. ఏపీకి వస్తే అభివృద్ధి చూపిస్తానంటూ రోజా ఆహ్వానించారు. అదేంటి.. ప్రగతిభవన్‌లో నవ్వుతూ ఫోటోలు దిగి.. బయటకు రాగానే విమర్శలా? అంటూ నెటిజన్లు రోజాను సోషల్ మీడియాలో కుమ్మేస్తున్నారు. జబర్దస్త్ కామెడీ అంటూ.. దొందు దొందేనంటూ కామెంట్లు పెడుతున్నారు. ఏపీ మంత్రుల విమర్శల్లో బొత్స సత్యనారాయణ చాలా వెరైటీగా రియాక్ట్ అయ్యారు. కేటీఆర్ చెప్పేదంతా అబద్ధం.. నేను ఇటీవలే హైదరాబాద్‌లో ఉండివచ్చా.. అక్కడ కరెంట్ లేదు.. జనరేటర్ వేసుకోవాల్సి వచ్చిందంటూ పిచ్చ కామెడీ చేశారు. అయితే, బొత్స వ్యాఖ్యలకు టీఆర్ఎస్ ఎంపీ రంజిత్ రెడ్డి ఖతర్నాక్ కౌంటర్ ఇచ్చారు. "తెలంగాణలో 2 నిమిషాలు కూడా కరెంట్ పోదు. బహుషా, బొత్స కరెంట్ బిల్లు కట్టలేదేమో. అందుకే కరెంట్ కట్ చేశారు కావొచ్చు. వైసీపీ నేతల కుటుంబాలు హైదరాబాద్‌లోనే ఉంటున్నాయి. ఇక్కడే ఉన్న జగన్ కుటుంబాన్ని అడిగినా తెలుస్తుంది. కేసీఆర్ పాలన బాగుందని వైసీపీ ఎంపీలే చెప్పారు" అంటూ ఆయన వేసిన సెటైర్ భలే పేలింది. మంత్రి బొత్సను సైతం హైదరాబాద్‌లో ఉండే ఏపీ వాసులు పోస్టులతో ఆటాడుకుంటున్నారు. బొత్స ఉన్నది ఎక్కడో చెప్పాలని.. మాకు మాత్రం ఇక్కడ ఒక్క నిమిషం కూడా కరెంట్ పోవట్లేదని.. బొత్స చెప్పేదంతా అబద్దమని.. హైదరాబాద్‌లో ఉన్న ఏపీ వాసుల బంధువులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో ట్రోల్స్, మీమ్స్‌తో బొత్సను చెడుగుడు ఆడుకుంటున్నారు.

# ప్రమాదాల నిలయంగా భాకరాపేట ఘాట్ రోడ్డు

తిరుపతి తిరుపతి జిల్లా చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని భాకరాపేట ఘాట్ రోడ్డు తరచూ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. తిరుపతి నుండి మదనపల్లి, అనంత పురం వెళ్లేందుకు ఇదే ప్రధాన జాతీయ రహదారి,ఈ ఘాట్ రోడ్డు లో ముఖ్యంగా రెండు అత్యంత ప్రమాదక రమైన మలుపులున్నాయి. ఈ రెండు మలుపుల వద్ద తరచు ప్రమాదాలకు గురికావడం గత నెలలో 60 మంది తో ధర్మవరం నుండి తిరుపతికి వస్తున్న బస్సు ప్రమాదానికి గురికావడంతో అందులో పది మంది ప్రయాణికులు మరణించడం జరిగింది. మరికొంతమంది కాళ్లు చేతులు పోగొట్టుకుని శాశ్వత వికలాంగులుగా మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డ వారిగా మారడం జరిగింది.ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఈ ఘాట్ రోడ్డును వెడల్పు చేయడం, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రోడ్డు పక్కన గోడ లాంటిది నిర్మించడంలాంటివి ఏమీ చేయకుండా నిమ్మకు నీరెత్తినట్టు ప్రభుత్వం గానీ ప్రభుత్వ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు.ఇకనైనా స్పందించి ఈ రహదారిని బాగు చేసి ప్రజల ప్రాణాలు పోకుండా కాపాడుతానని వాహనచోదకులు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# నివురు కప్పిన నిప్పు

### అక్కడి వైకాపా వర్గవిబేధాలు

ఏలూరు ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండల పరిధిలోని జి.కొత్తపల్లిలో శనివారం ఉదయం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి వచ్చిన వైసీపీ నేత, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుపై సొంత పార్టీ కార్యకర్తలే దాడికి దిగారు. ఎమ్మెల్యేను వైసీపీ కార్యకర్తల దాడి నుంచి రక్షించేందుకు పోలీసులు తీవ్రంగా యత్నించినా... గ్రామస్తులంతా ఒక్కసారిగా మీద పడటంతో ఎమ్మెల్యే వారి చేతిలో దెబ్బలు తినక తప్పలేదు. ఆ తర్వాత అతి కష్టం మీద పోలీసులు ఎమ్మెల్యేను గ్రామస్తుల బారి నుంచి తప్పించినా... అప్పటికే గ్రామస్తుల దాడిలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు గాయాలయ్యాయి. ఈ ఘటనకు దారి తీసిన వివరాల్లోకెళితే... జి.కొత్తపల్లి వైసీపీలో రెండు వర్గాలు ఉన్నాయి. వైసీపీ గ్రామ అధ్యక్షుడిగా ఉన్న గంజి ప్రసాద్ శనివారం ఉదయం దారుణ హత్యకు గురయ్యారు. గ్రామంలోని ప్రసాద్ వ్యతిరేక వర్గమే ఆయనను హత్య చేయించిందని అతడి వర్గీయులు అనుమానిస్తున్నారు. అంతేకాకుండా ప్రసాద్ వ్యతిరేక వర్గాన్ని స్వయంగా ఎమ్మెల్యే ప్రోత్సహించారని కూడా అనుమానాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రసాద్ హత్య గురించిన సమాచారం అందుకున్న వెంటనే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గ్రామానికి వెళ్లారు. అప్పటికే ప్రసాద్ మృతి నేపథ్యంలో వ్యతిరేక వర్గంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న మృతుడి వర్గీయులు... ఎమ్మెల్యేను చూడగానే ఒక్కసారిగా రెచ్చిపోయారు. ఎమ్మెల్యేపై మూకుమ్మడిగా దాడికి దిగారు. పోలీసులు అడ్డుకుంటున్నా... గ్రామస్తులు ఏమాత్రం తగ్గలేదు. ఒకానొక దశలో పోలీసులను తోసేసి మరీ ఎమ్మెల్యేపై గ్రామస్తులు దాడికి దిగారు. పరిస్థితి విషమిస్తోందని తెలుసుకున్న పోలీసులు మరింతగా శ్రమించి ఎలాగోలా ఎమ్మెల్యేను గ్రామస్తుల బారి నుంచి పక్కకు తప్పించారు. అక్కడి నుంచి పరుగు పరుగున తరలించారు. అయితే అప్పటికే గ్రామస్తుల దాడిలో ఎమ్మెల్యేకు గాయాలయ్యాయి

# మూగజీవాలకు సేవ... భగవంతుని సేవ

### పశు సంపద వృద్ధికి కృషి చేయాలి
### జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి
### ఘనంగా ప్రపంచ వెటర్నరీ దినోత్సవం

విజయనగరం, ఏప్రెల్ 30 జిల్లాలో పశు సంపదను వృద్ధి చేసేందుకు, పశువైద్యులంతా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి పిలుపునిచ్చారు. పశువైద్యం ఎంతో ఘనమని ఆమె పేర్కొన్నారు. స్థానిక లీపేరడైజ్ కల్యాణమండపంలో, ప్రపంచ వెటర్నరీ దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ, పశువైద్యం ఎంతో గౌరవప్రదమైన గొప్ప వృత్తి అని అన్నారు. మూగజీవాలకు సేవ చేయడం భగవంతుని సేవతో సమానమని పేర్కొన్నారు. పశువులకు, జీవాలకు వైద్యం చేయడంతోపాటు, పశువైద్య శాస్త్రాన్ని అభ్యసించడం కూడా చాలా కష్టమని అన్నారు. సమాజంలో పశువైద్యుల పాత్ర ఎంతో కీలకమని, పశువులు, ఇతర జీవాలనుంచి మానవులకు సంక్రమించే సుమారు 200 రకాల వ్యాధులను నియంత్రించాల్సిన బాధ్యత వీరిపై ఉందని అన్నారు. ఉద్యోగాల్లో సహజంగా వచ్చే నిర్లిప్తతను విడనాడి, మూగజీవాల ఆరోగ్యంపట్ల మరింత శ్రద్ధ వహించాలని కోరారు. తీవ్రమైన వ్యాధులు విజృంభించే సమయంలో మాత్రమే కాకుండా, ఇతర సమయంలో కూడా జునోసిస్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పాల ఉత్పత్తిని పెంచడంతోపాటుగా, పశువుల సంఖ్యను వాస్తవికంగా పెంచేందుకు కృషి చేయాలని, ఒకరివద్దనుంచి మరొకరికి పశువుల మార్పిడి కాకుండా, కొత్త జీవాలను సృష్టించేందుకు ప్రయత్నించాలని సూచించారు. పశుసంపదను పెంచితే, రైతుల ఆదాయం గణనీయంగా పెరగడమే కాకుండా, పరోక్షంగా పర్యావరణానికి ఎంతో మేలు చేసినట్టేనని అన్నారు. దీనికి పలమనేరు ప్రాంతాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రస్తుతం గొర్రెలు, మేకల పెంపకం యూనిట్లు ఎంతో లాభసాటిగా నడుస్తున్నాయని కలెక్టర్ చెప్పారు. పశు సంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వైవి రమణ మాట్లాడుతూ, ప్రతీ సంవత్సరం ఏప్రెల్ నెలలో చివరి శనివారం ప్రపంచ వెటర్నరీ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో శువైద్య రంగంలో విశేష కృషి చేసిన వారికి,

ఈ సందర్భంగా అవార్డును ప్రదానం చేయడం జరుగుతోందని తెలిపారు. పశు సంపదను వృద్ధి చేయడం, పశువుల ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా, పశువుల నుంచి వివిధ రకాల వ్యాధులు మానవులకు సోకకుండా నిరోధించాల్సిన బాధ్యత కూడా పశువైద్యులపై ఉందని చెప్పారు. జిల్లా పశుసంవర్థక శాఖ, అందిస్తున్న సేవల పరంగా, రాష్ట్రంలో మొదటి మూడు స్థానాల్లో ఉందని తెలిపారు.పశు మత్స్య దర్శిని పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గరివిడి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చెంగల్వరాయుడు, డివిజనల్ డిప్యుటీ డైరెక్టర్లు డాక్టర్ రామచంద్ర, డాక్టర్ ఆర్.నీలయ్య, విటిసి డిడి డాక్కర్ భాస్కరరాజు, ఇంకా డాక్టర్ నరేష్, డాక్టర్ కృష్ణ, పలువురు ఏడిఏలు, పశు వైద్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జి కొత్తపల్లిలో వైకాపా నేత దారుణ హత్య

### ఎమ్మెల్యేపై దాడికి దిగిన స్థానికులు

ఏలూరు ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో దారుణ హత్య జరిగింది. వైఎస్ఆర్సీపీ నాయకుడు గంజి ప్రసాద్ ను శనివారం ఉదయం దుండగులు ఉదయం హత్య చేసారు. ఉదయం 7 గంటల సమయంలో హత్య జరిగినట్లు సమాచారం. ప్రసాద్ హత్య విషయం తెలియగానే జి.కొత్తపల్లిలో ఉద్రిక్తత నెలకొంది. స్థానికంగా వుంటున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పై జి కొత్తపల్లి వాస్తవ్యులు దాడికి దిగారు. ఒక్కసారిగా గ్రామస్థులు తిరగబడడంతో పోలీసులు ఏమి చేయలేని పరిస్థితిలో పడిపోయారు. ఒక దశలో పోలీసులపై కుడా దాడి జరిగింది. ఘటనలో ఎమ్మెల్యే కు గాయలు అయ్యారు. ఒక గ్రామస్థుడికి చెయ్యి విరిగింది.

# ఎన్ ఎఫ్ డి బి సభ్యులు కోలంగారి పోలయ్యకు ఘన సన్మానం

### దక్షిణ కోస్తా మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమానికి కృషి చేయాలి
### -నెల్లూరు జిల్లా పట్టపు మత్స్యకారులు

నెల్లూరు మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు సభ్యులుగా నియమితులైన కోలంగారి పోలయ్య దక్షిణ కోస్తా మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమానికి కృషి చేయాలని నెల్లూరు జిల్లా మత్స్యకారులు కోరారు. నెల్లూరు నగరంలోని స్థానిక పప్పుల వీధి ప్రాంతంలో ఉన్న శ్రీ పాండురంగ అన్నదాన సమాజం సమావేశ మందిరంలో కోలంగారి పోలయ్యకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత పోలయ్యను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన మత్స్యకార కుటుంబాలకు రుణాల రూపంలో ఆర్థిక సహాయం అందించే ఎన్ ఎఫ్ డి బి సంస్థలు సభ్యులుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత పోలయ్య మాట్లాడుతూ జాతీయ ,రాష్ట్ర ,జిల్లా స్థాయి మత్స్యకార నాయకులకు, కేంద్ర రాష్ట్ర అధికార పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకముతో కట్టబెట్టిన పదవీ బాధ్యతలను నిర్వర్తిస్తూ మత్స్యకార కుటుంబాలు అభివృద్ధి సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. జిల్లాలోని మత్స్యకారుల సమన్వయ ఐక్యతతో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన జాతీయ స్థాయి నామినేటెడ్ పదవి ప్రప్రథమంగా మత్స్యకారులకు కేటాయించడం అభినందనీయమన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టపు మత్స్యకారులను గుర్తించినట్లుగా చెప్పుటకు ఎన్ ఎఫ్ డి బి సభ్యులుగా పొలంగారి పోలయ్యను ఎంపిక చేయడమే ఉదాహరణగా తీసుకోవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలుత టిడిపి ప్రభుత్వం 2017 లో ఆప్కాబ్ చైర్మన్ గా కొండూరు పోలిశెట్టి ని నిర్మించడం జరిగిందన్నారు. అదేవిధంగా 2019లో కొండూరు అనిల్ బాబు ఆప్కాబ్ చైర్మన్ పదవి కట్టబెట్టిందన్నారు. కాలక్రమంలో 2022లో కేంద్ర ప్రభుత్వం మత్స్యకారులను గుర్తిస్తూ ఎం ఎస్ డి బి లో జాతీయస్థాయి అవకాశం కల్పిస్తూ నెల్లూరు జిల్లాకు చెందిన కోలంగారి పోలయ్యను ఎం ఎఫ్ డి బి సభ్యులుగా నియమించడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో పట్టపు మత్స్యకారుల కుటుంబాలకు అత్యున్నత స్థాయి పదవులు లభించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ కొండూరు పోలిశెట్టి ,జనార్ధన్ ,శేషయ్య విజయమ్మ , వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా సాహితీ స్రవంతి నివాళులు

విశాఖపట్నం మహాకవి శ్రీశ్రీ 112 వ జయంతి సందర్భంగా విశాఖ ఆర్కే బీచ్ వద్ద ఉన్న శ్రీ శ్రీ విగ్రహానికి సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజ శర్మ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఎందరో కవులు ఎంతో అమూల్యమైన సాహిత్యాన్ని మానవాళికి అందించినప్పటికీ వారందరిలో శ్రీ శ్రీ ది ప్రత్యేకమైన స్థానమని సామాన్య ప్రజలకు అర్థమయ్యే సరళ భాషలో బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న కష్టాలను తెలియజేస్తూ వాటిని అధిగమించి నూతన సమాజ నిర్మాణానికి కృషి చేయవలసిన ఆవశ్యకతను, మార్గాన్ని నిర్దేశించారని తెలియజేశారు. కష్టజీవికి అటు ఇటు నిలిచే వాడే కవి అని తను చెప్పాలనుకున్న విషయాన్ని ఒక్క వాక్కులు తెలియజేయగలగిన మహా మేధావి శ్రీశ్రీ అని పేర్కొన్నారు. శ్రీ శ్రీ రచన అన్ని సమాజాలకు కాలాలకు మరీ ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితులను అద్దం పట్టేలా ఉంటాయని తెలియజేశారు.కార్మిక వర్గ సిద్ధాంతాన్ని చాటి చెప్పడంలో ముందున్నారు శ్రీశ్రీ. శ్రీశ్రీ విశాఖ వాసి కావడం మన అదృష్టమన్నారు. సాహిత్యాన్ని సామాన్యులకు అందించారని,శ్రీశ్రీ పేరుతో ఆంధ్రా యూనివర్సిటీ లో ఓ పీఠం ఏర్పాటు చేయాలని కోరారు.

# పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసస్ చెన్నకేశవులు విజ్ఞప్తి చేశారు. నేడు అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని రామారావు కాలనీ నందున్న పోస్టాఫీసును ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోస్టు మాస్టర్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు మాట్లాడుతూ పోస్టాఫీసు నందు అనేక సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వడ్డీ రేటు అన్ని బ్యాంకుల కంటే ఎక్కువ ఉందని, అదే విధంగా సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ఆడ పిల్లలు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# భర్తను హత్య చేసిన భార్య

నంద్యాల శిరివెళ్ల మండలం గుండం పాడు గ్రామంలో శనివారం ఉదయం భర్తను భార్య గొడ్డలితో నరికి హత్య చేసిన సంఘటన సంచలనంగా మారింది. గుండంపాడు గ్రామానికి చెందిన మెట్ల సత్య రాజు (67) ను భార్య సరోజమ్మ (64) శనివారం ఉదయం గొడ్డలితో నరకడం వల్ల అక్కడికక్కడే ప్రాణాలు వదిలినట్లు తెలిపారు.

మృతుడు సత్య రాజు దైవ సేవకునిగా ఉంటూ ప్రార్థనలు చేసుకుంటూ పేన్షన్ ద్వారా జీవనం సాగిస్తున్న కుటుంబంలో తరుచూ చిన్న చిన్న మనస్పర్థలు కొద్దిపాటి గొడవలు జరిగేవని గ్రామస్తులు తెలిపారు. నిందితురాలు సరోజమ్మను శిరివెళ్ల పోలీస్ స్టేషన్ కు తరలించారు. చాలాసేపటివరకు మృతదేహం గుండం పాడు గ్రామం లోని సంఘటనా స్థలం వద్దనే ఉంది. మధ్యాహ్నం పంచనామా నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించచారు.

# రాహుల్ ఎడ్యుకేషనల్యాండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రంజాన్ ఈద్ కిట్ల పంపిణీ....

నంద్యాల ఏప్రిల్ 30 నంద్యాల పట్టణంలో రాహుల్ ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ ఈద్ కిట్లను పంపిణీ చేయడం జరిగింది రాహుల్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ అధ్యక్షతన ఈ ఈ తిట్లు పంపిణీ చేయడం జరిగిందని నంద్యాల పట్టణ అధ్యక్షుడు సలీం తెలిపారు. ఉపాధ్యక్షుడు ఫారుక్ మాట్లాడుతూ రాహుల్ సొసైటీ తరఫున పేదవాళ్లకు చాలామందికి న్యాయం జరుగుతుందని బ్లడ్ డోనర్స్ గాని ఆర్థిక సహాయం గాని రంజాన్ పండుగ కి తుఫాను గాని ఇటువంటివి చాలా ఇవ్వడం గతంలో జరిగిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రాహుల్ సొసైటీ సభ్యులు సబియా ఆరు సలీం మల్లీ కుమార్ రాజా జావిద్ హమీద్ ల్లా తదితరులు పాల్గొనడం జరిగింది.

# నగరంలో డ్రైనేజీ సమస్య లేకుండా చర్యలు చేపట్టండి

### కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి నగరంలో ఎక్కడా డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. నగరంలోని జీవకొన, ఎస్.ఎల్.వి.నగర్, లెప్రసి కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలను కార్పొరేటర్లు సంధ్య, అనిల్ కుమార్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో పరిశీలించారు. పలు చోట్ల డ్రైనేజీ కాలువలు బ్లాక్ కావడం, నీరు రోడ్ల పైకి వస్తున్నాయని ప్రజలు కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ నగరంలో ఎక్కడ కూడా డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సకాలంలో రోగులకు వైద్య సేవలు అందించడంతో పాటు నిర్వహణ, పరిపాలన పరంగా కూడా దృష్టి పెట్టాలి



**ప్రైవేట్ అంబులెన్స్ లను ఆస్పత్రి ఆవరణలో పార్క్ చేయకూడదు**
**ఆస్పత్రిలో మరణించిన వారి మృత దేహాలను ఆస్పత్రికి చెందిన మహాప్రస్థానం వాహనాల్లో పంపాలి**
**ఆస్పత్రిలోని ముఖ్యమైన విభాగాల్లో అవసరమైన అన్ని పరికరాలు ఉండాలి**
**ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా ఉండాలి**
**నాడు నేడు కింద చేపట్టిన ఆసుపత్రుల పనులను గడువు లోపు పూర్తి చేయాలి**
**:- కర్నూలుజిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు**

కర్నూలు ఏప్రిల్ 30 :- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సకాలంలో రోగులకు వైద్య సేవలు అందించడంతో పాటు నిర్వహణ, పరిపాలన పరంగా కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని కర్నూలుజిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు వైద్యాధికారులను ఆదేశించారు.శనివారం ప్రభుత్వ మెడికల్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్ లో వైద్య, ఆరోగ్య సంబంధిత అంశాలపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షించారు..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ అంబులెన్స్ లను ఆస్పత్రి ఆవరణలో పార్క్ చేయకూడదని స్పష్టం చేశారు .ఆస్పత్రిలో మరణించిన వారి మృత దేహాలను ఆస్పత్రికి చెందిన మహాప్రస్థానం వాహనాల్లో పంపాలన్నారు.. ప్రైవేట్ అంబులెన్స్ ల్లో పంపాల్సిన అవసరం వచ్చినపుడు ఆర్టీవో పోలీసు, మెడికల్ అధికారులతో కూడిన కమిటీ ద్వారా అంబులెన్స్ లను పంపే పద్ధతిని అమలు చేయాలన్నారు..వాహనాల రేటు ను కూడా కమిటీ నిర్ధారిస్తుందన్నారు..ఆస్పత్రిలో తగినన్ని స్ట్రెచర్ లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ను ఆదేశించారు. ఏ పీ ఎస్ ఎమ్ ఐ డి సి నుంచి సరఫరా ఆలస్యం అయినట్లయితే హాస్పిటల్ డెవలప్మెంట్ ఫండ్స్ నుండి వీటిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఆస్పత్రిలో ముఖ్యమైన విభాగాల్లో అవసరమైన అన్ని పరికరాలు పని చేసే పరిస్థితిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏవి వర్కింగ్ కండిషన్లో ఉన్నాయి, వేటికి మరమ్మతులు అవసరమో వివరాలతో జాబితా తయారు చేసి ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో బయో మెడికల్ వేస్టేజీ రూమును రెండు నెలల లోపు నిర్మించాలని ఏపీఎమ్ఎస్ఐడిసి ఈ ఈ సదాశివ రెడ్డి ని ఆదేశించారు. అలాగే వర్షాకాలం వచ్చేలోపు ఆస్పత్రి డ్రైనేజీ సిస్టం ను కూడా సరిచేయాలని సూచించారు..ఆస్పత్రి పరిసరాలు అందంగా ఉండేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి మెయిన్ గేటు, ఆర్చిలు కాంపౌండ్ వాల్ లకు పెయింటింగ్ వేయించాలని ఆసుపత్రి సూపరింటెన్డెంట్ ను ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో జూన్ నెలాఖరు లో మొక్కల పెంపకం చేపట్టాలని, ఏ ఏ మొక్కలు, ఎన్ని అవసరమో వివరాలు ఇవ్వాలని, అందుకు అనుగుణంగా మొక్కలు సరఫరా చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రి ఆవరణ లోకి పందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హాస్టల్స్ పారిశుద్ధ్యం, స్నానపు గదుల్లో నీటి సరఫరా తదితర అంశాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జిక్కిని ఆదేశించారు .త్వరలో హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ మీటింగ్ నిర్వహణకు అజెండా, తేదీ ఖరారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.నాడు నేడు కింద ఆస్పత్రుల నిర్మాణాలపై కలెక్టర్ సమీక్షిస్తూ ఆదోనిలో రూ. 475 కోట్లతో నిర్మించనున్న మెడికల్ కాలేజి పనులను మే 15 వ తేదీ లోపు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎమ్ఎస్ఐడిసి ఈ ఈ సదాశివ రెడ్డి ని ఆదేశించారు. అలాగే రూ. 39. 64 కోట్లతో చేపడుతున్న ఆదోని ఏరియా ఆస్పత్రి, ఎమ్మిగనూరు, ఆలూరు, కోడుమూరు, ఓర్వకల్లు, వెల్దుర్తి సి హెచ్ సి ల ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు..సమావేశంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెన్డెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి ,డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి ,మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిక్కి , సిఎస్ఆర్ఎంఒ బి. వెంకటేశ్వరరావు,ఏపీఎమ్ఎస్ఐడిసి ఈ ఈ సదాశివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రంగస్థల కళా కార్మికులను పట్టించుకునే వారేలేరు



**రంగస్థల కళా కార్మికులకు చిల్లిగవ్వ ఇవ్వలేదు**
**కళలు జీవించి ఉండాలంటే రంగస్థల కళాకారులు, వృత్తి కళాకారులను ఆదరించాలి**

కర్నూలు ఏప్రిల్ 30 :- 'కరోనా వచ్చిందని అన్ని వర్గాలకు సాయం అందించారు.. రంగస్థల కళాకార్మికులకు మాత్రం చిల్లిగవ్వ ఇచ్చిన నాథుడే లేడు.. రంగ స్థలాన్ని నమ్ముకున్న వృత్తి కళాకారులు ప్రభుత్వానికి, పాలకులకు కనిపించలేదా..?' అని తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం కర్నూలు జిల్లా అధ్యక్షుడు పి.హనుమంతరావు చౌదరి ప్రశ్నించారు. రేపు మేడే సందర్భంగా కార్మికుల గురించి ఏదేదో హడావుడి చేస్తున్న ప్రభుత్వం.. పాలకులు, అధికారులు రంగ స్థలాన్ని నమ్ముకుని.. రంగస్థలం.. నాటక రంగంపైనే ఆధారపడి జీవిస్తున్న వారి గురించి పట్టించుకుని తగిన ఆదరణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నగరంలోని పాతబస్టాండ్ డ్రస్ కంపెనీల వద్ద తెలుగుదేశం పార్టీ 2వ వార్డు కార్పొరేటర్ లతీఫ్, డ్రస్ కంపెనీల ప్రతినిధులు ప్రసాద్, మధు ఆధ్వర్యంలో రంగస్థల వృత్తి కార్మిక కళాకారులకు దుస్తులు, చీరలను టిడిపి సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు, హనుమాన్ కళాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని ప్రజలు నిత్యం దైనందిన జీవితంలో రకరకాల సమస్యలతో సతమతమవుతుంటారని.. అలాంటి వారిని ఆహ్లాదపరచడం ద్వారా సమాజ శాంతి, సంతోషాలు కల్పించడంలో కళారంగానిది కీలకపాత్ర అన్నారు. స్టేజీ మీద కళాకారులు నటించి ఆకట్టుకున్నాడంటే.. తెరవెనుక ఎంతో కృషి జరుగుతుందని, మేకప్, దుస్తులు, స్టేజీని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం.. సంగీత వాయిద్యాల శబ్దం.. ఇలా అన్ని సమపాళ్లతో కుదిరినప్పుడే కళా ప్రదర్శనలు పండుతాయన్నారు.సమాజంలో శాంతి, ఆహ్లాద వాతావరణం నెలకొనడంలో కళాకారుల కృషి విస్మరించలేదనిదని అన్నారు. కళా కార్మికుల సహకారం లేనిదే కళలు మనుగడ సాగించలేవని ఆయన పేర్కొన్నారు. కరోనా వచ్చిందని ప్రభుత్వం, నాయకులు, అధికారులు, దాతలు చాలా మంది చాలా రకాలుగా ఎందరికో సాయం చేశారు.. కానీ రంగస్థలాన్ని నమ్ముకున్న కళాకారులు, కళాకార్మికులను ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.

# టిజి వెంకటేష్ జన్మదినం సందర్భంగా వివాహాలకు ఆర్థిక సహాయం :- టిజి భరత్

కర్నూలు ఏప్రిల్ 30 :- తన తండ్రి, ఎంపీ టిజి వెంకటేష్ జన్మదినం సందర్భంగా మే 16వ తేదీన వివాహం చేసుకునే నూతన వధూవరులకు



ఆర్థిక సహాయం అందజేస్తామని టీజీవి సంస్థల చైర్మన్ టిజి భరత్ తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే సామూహిక వివాహాలు కరోనా, ఇతర కారణాలతో గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహించలేదన్నారు. ఈ ఏడాది కూడా సామూహిక వివాహాలకు పరిస్థితులు అనుకూలంగా లేవన్నారు. ఈ నేపథ్యంలో మే నెల 16వ తేదీన వ్యక్తిగతంగా వివాహం చేసుకునే వారికి రూ. 60వేలు ఆర్థిక సహాయంతో పాటు పట్టు వస్త్రాలు, తాళి బొట్టు, మెట్టెలు అందజేయాలని నిర్ణయించు కున్నట్లు చెప్పారు. మే 1వ తేదీ నుండి మౌర్య ఇన్ లోని టిజిబి యూత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, 10వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఆర్థిక సహాయం పొందాలనుకునే వధూవరులలో ఒకరు కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన వారు కానీ, పంచలింగాల, గొందిపర్ల, ఈ తాండ్రపాడు, పూలతోట, దొడ్డిపాడు, దేవమాడ గ్రామాలకు చెందిన వారై ఉండాలన్నారు. వధూవరుల వయస్సు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని టిజి భరత్ తెలిపారు.

# పేద ముస్లింలకు రంజాన్ తోఫా అందించిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్.ఎమ్.డి షారూక్..

నంద్యాల ఏప్రిల్ 30 నంద్యాల పట్టణంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలు సంతోషంగా పండుగకు జరుపుకోవడానికి తమ వంతు సహాయంగా రంజాన్ తోఫా అందించడం జరిగిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్.ఎమ్.డి ఫారూఖ్ పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ప్రతి సంవత్సరం రంజాన్ తోఫా ప్రభుత్వం తరపున అందించేవారని వైసీపీ ప్రభుత్వం వచ్చి మూడేళ్లు కావస్తున్నా ఇంతవరకు ముస్లింలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం ఉందని మైనార్టీలకి నాడు చంద్రబాబు పెట్టిన కోట్ల విలువైన పథకాలు పథకాలన్నీ రద్దు చేసి ముస్లీం సోదరులని నిండా ముంచిన జగన్ కు ఇఫ్తార్ విందులు ఇచ్చే అర్హత లేదన్నారు అంకెల గారడీలతో మాయ మాటలలు చెప్పి ఇంకా ఎన్నాళ్ళు ముస్లిం సమాజాన్ని మోసం చేస్తారని ప్రశ్నించారు ఇప్పటికైనా జగన్ కళ్ళు తెరిచి ముస్లిం సమాజానికి ఇచ్చిన ప్రతి హామీని అమలు పరచాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ విభాగం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ముల్లా ఇలియాస్ విశ్వనాథ్ రెడ్డి.చంద్ర రెడ్డి మాజీ కౌన్సిలర్ మిద్దె హుస్సేని పిట్టల మాదర్సా సైలబ్.అక్బర్.నస్యం షబ్బీర్ మహబూబ్ బాషా సుహైల్ రానా తదితరులు పాల్గొన్నారు.

# నాన్నా పులి కథ.. కొత్త సినిమాల వ్యథ

కరోనా కారణంగా చాలా వరకు సినిమాలు థియేటర్లో విడుదలై దాదాపు రెండేళ్లు కావస్తోంది. సరైన వాతావరణం లేకపోవడం థియేటర్లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వకపోవడం.. ఒక వేళ అనుమతులు మంజూరు చేసినా 50 శాతం సీటింగ్ కెపాసిటీకి మాత్రమే వీలు కల్పించడంత చాలా వరకు స్టార్ హీరోల చిత్రాలు రిలీజ్ లను గత కొన్ని నెలలుగా వాయిదా వేసుకుంటే వచ్చాయి. అయితే తాజాగా పరిస్థితుల్లో మార్పులు మొదలై 100 శాతం ఆక్యుపెన్సీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వరుసగా సినిమాలు థియేటర్లలో సందడి చేయడం మొదలైంది.అయితే ఇంత కాలంగా థియేటర్ల కారణంగా రిలీజ్ లు వాయిదా వేసుకున్న చిత్రాల లిస్ట్ భారీగా పెరిగిపోవడంతో బంచ్ లు బంచ్ లుగా థియేటర్లలో కి రావడం మొదలైంది. పాన్ ఇండియా చిత్రాల రిలీజ్ లు వుండటంతో చాలా వరకు చిన్న సినిమాల రిలీజ్ లు ఆగిపోయాయి. జనవరి ఫిబ్రవరి మార్చి ఏప్రిల్ లలో బిగ్ మూవీస్ రిలీజ్ కావడంతో ఈ నెల్లోల రిలీజ్ కావాల్సిన సినిమాలన్నీ దాదాపుగా పోస్ట్ పోన్ అవుతూ వస్తున్నాయి. ఇప్పటికి ఒక్కో సినిమా రిలీజ్ డేట్ లని నాలుగైదు సార్లు మార్చేసింది. దీంతో కొత్త సినిమాల పరిస్థితి నాన్నా పులి.. ఆటలా మారింది.ఈ ఆటలో ముందు వరుసలో నిలిచిన చిత్రం 'మేజర్'. అనురాగ్ రెడ్డి శరత్ చంద్ర లతో




కలిసి సూపర్ స్టార్ మహేష్ బాబు ఈ చిత్రాన్ని నిర్మించారు. ముంబై బాంబ్ బ్లాస్ట్ ల నేపథ్యంలో ఈ చిత్రాన్ని శశికిరణ్ తిక్క తెరకెక్కించారు. అడివి శేష్ హీరోగా నటించిన చిత్రమిది. సందీప్ ఉన్నికృష్ణన్ రియల్ స్టోరీ నేపథ్యంలో ఈ మూవీని తెలుగు హిందీ భాషల్లో ఏక కాలంలో రూపొందించారు. గత ఏడాది జూలై 2న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. కానీ కుదరలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 11న విడుదల విడుదల చేయాలనుకున్నారు. అయితే అది కూడా కుదరకపోవడంతో మే 27ను ఫైనల్ చేసుకున్నారు. ఈ డేట్ ని మిగతా సినిమాలు ఆక్రమించుకోవడంతో మళ్లీ రిలీజ్ డేట్ ని మార్చేశారు. ఫైనల్ గా 'మేజర్' రిలీజ్ డేట్ జూన్ 3కు మారింది.తెలుగు హిందీతో పాటు తమిళంతోనూ రిలీజ్ చేస్తున్నట్టుగా ప్రకటించారు. ఇదే తరహాలో 'ఎఫ్ 3' కూడా చాలా సార్లు వాయిదాపడుతూ వచ్చింది. ముందు ఈ మూవీని ముందు గత ఏడాది ఆగస్టు 27న విడుదల చేయాలనుకున్నారు. కానీ కరోనా కారణంగా వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ తరువాత జనవరిలో ఎట్టిపరిస్థితుల్లో రిలీజ్ చేయాలని భావించారు. కానీ అదే సమయంలో రాధేశ్యామ్ ట్రిపుల్ ఆర్ రిలీజ్ అంటూ ప్రకటన రావడంతో ఆ నిర్ణయాన్ని విరమించుకున్నారు. తరువాత ఫిబ్రవరి 25 అనుకున్నారు. కానీ 'భీమ్లానాయక్' రావడంతో తనతో క్లాష్ అని తప్పుకున్నారు. ఏప్రిల్ 28ని లాక్ చేసుకోవాలనుకున్నారు అదే సమయంలో 'ఆచార్య' రిలీజ్ డేట్ ని ప్రకటించడంతో చివరికి మే 27ని ఫైనల్ చేసుకోవాల్సి వచ్చింది.ఇదే తరహాలో నేచురల్ స్టార్ నాని నటించిన రొమాంటిక్ ఎంటర్ టైనర్ 'అంటే సుందరానికి' చిత్రం కూడా మల్టీపుల్ టైమ్స్ రిలీజ్ డేట్ ని మార్చుకుకోవాల్సి వచ్చింది. గత ఏడాదే రిలీజ్ చేయాలనుకున్నా కోవిడ్ కారణంగా వాయిదా వేశారు. ఇక సమ్మర్ సీజన్ ప్రారంభానికి ముందు రిలీజ్ అనుకున్నారు. అయితే బ్యాక్ టు బ్యాక్ బిగ్ స్టార్స్ మూవీస్ వుండటంతో మళ్లీ వెనక్కి తగ్గారు. ఫైనల్ గా జూన్ 10 ని లాక్ చేసుకున్నారు. ఇక మాస్ మహారాజా రవితేజ సినిమా పరిస్థితి కూడా ఇలాగే వుంది.

# యష్ హీరో అవుతాడని పేరెంట్ కి నమ్మకం లేదా?

ఏ నోట విన్నా రాకింగ్ స్టార్ యష్ గురించే. డార్లింగ్ ప్రభాస్ తర్వాత సౌతిండియాలో ఎక్కువగా వినిపిస్తున్న పాన్ ఇండియా నేమ్ యష్ మాత్రమే. అతడు కేజీఎఫ్ రిలీజయ్యేంత వరకూ అందరిలాగే ఒక సాధారణ నటుడు. అంతకుమించి అతడు ఏదో సాధిస్తాడని ఎవరూ అనుకోలేదు. కానీ అంతా అనూహ్యం.. ప్రతిదీ ఓవర్ నైట్ మారిపోయింది.ఒకే ఒక్క రాత్రిలో అతడు పాన్ ఇండియా స్టార్ గా అవతరించాడు. ఇది కేజీఎఫ్ తెచ్చిన క్రేజ్. కేజీఎఫ్ 2 సంచలన



విజయంతో ఇప్పుడు అతడు దేశంలోనే టాప్ రేంజ్ హీరోగా వెలిగిపోతున్నాడు. షారూక్ నటించిన సినిమాని సౌత్ లో చూడకపోవచ్చు కానీ యష్ నటించిన సినిమాని దేశం మొత్తం చూడటానికి అభ్యంతరం లేదు.అయితే యష్ ఇంత పెద్ద స్టార్ అయినా కానీ.. ఐఉఈ స్టార్ గా తన వినయవిధేయతలు ఒదిగి ఉండే స్వభావాన్ని ఎప్పుడూ విడిచిపెట్టలేదు. అతడి గతాన్ని తెలుసుకోవాలనే తపించేవారి కోసం ఒక ఆసక్తికర విషయాన్ని చెప్పాడు. నిజానికి యష్ హీరో అవుతాడని అతడి తల్లిదండ్రులు అస్సలు అనుకోలేదు.తొలిగా తన తల్లిదండ్రుల అనుమతి కోసం ప్రయత్నించినా నమ్మకం వ్యక్తం చేయలేదు. "వారు ఓకే అని అన్నారు. గరిష్టంగా ఒకటి లేదా రెండు రోజులు అతను అక్కడ ఉంటాడు.. లేదా ఒక వారంలోనే తిరిగి వెనక్కి ఇంటికి వచ్చేస్తాడు. అతను జీవితం అంటే ఏమిటో గ్రహిస్తాడు" అని అనుకున్నారట. అయితే నాకు ఎప్పుడూ ప్లాన్ బి లేదు.. నేను ఎప్పుడూ నేనే హీరోనని అనుకున్నాను.ఎందుకంటే చిన్నతనంలో నేను చాలా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనేవాడిని. నేను దానివల్ల అదనపు శ్రద్ధాసక్తులను సంపాదించాను. ప్రజలు చప్పట్లు ఈలలు వేసేవారు. కాబట్టి నేను చాలా చిన్న వయస్సులోనే దానికి బానిస అయ్యాను అని కూడా తెలిపాడు.కేజీఎఫ్ ముందు కేజీఎఫ్ తర్వాత శాండల్వుడ్ ఎలా ఉంది? అని అడిగితే.. "ఆ ఒక్క అడుగు చేయడం వల్ల మన పరిశ్రమలో చాలా మార్పు వచ్చింది. దేశంలోని ప్రతి ప్రాంతంలో ప్రజలు దీనిని స్వీకరించారు.. ఇది జరుగుతుందని ఎవరూ ఊహించలేదు. మీ ఉత్పత్తిపై మీకు నమ్మకం ఉంటే మీరు బయటకు వెళ్లి అన్వేషించాలని నేను భావిస్తున్నాను" అని అన్నారు.మొత్తానికి శాండల్వుడ్ ని 1000 కోట్ల క్లబ్ లో చేర్చిన ఘనత యష్ కే చెందుతుంది. వందేళ్ల భారతీయ సినిమా చరిత్రలో ఇది అసాధారణ ఫీట్ అని చెప్పాలి. బాహుబలితో ప్రభాస్ చరిత్రను తిరగరాస్తే అతడిని అనుసరించడంలో యష్ సక్సెసయ్యాడు. తెలుగు పరిశ్రమ కన్నడ పరిశ్రమలను ప్రాంతీయ పరిశ్రమలు అని తీసిపారేసే వారికి సరైన జవాబుగా నిలిచారు. ప్రభాస్- యష్ ల సక్సెస్ తర్వాత ఆర్.ఆర్.ఆర్ తో రామ్ చరణ్- ఎన్టీఆర్ కూడా పాన్ ఇండియా రేస్ లోకి దూసుకొచ్చిన సంగతి తెలిసినదే.

# పారిస్ వీధుల్లో సూపర్ స్టార్ హల్ చల్

సినిమా పూర్తి కాగానే మన స్టార్స్ చాలా వరకు విశ్రాంతి మోడ్ లోకి వెళ్లిపోతుంటారు. ఫ్యామిలీతో కలిసి సరదాగా విహార యాత్రకు వెళుతుంటారు. విదేశాలు చుట్టొస్తుంటారు. ఇందులో ముందు వరుసలో నిలిచే హీరో సూపర్ స్టార్ మహేష్ బాబు. ఏడాదిలో చాలా వరకు విదేశాల్లో ఫ్యామిలీతో సరదాగా విహరిస్తూ విలువైన సమయాన్ని ఫ్యామిలీతో గడిపేస్తుంటారు. ప్రస్తుతం మహేష్ బాబు అదే పనిలో వున్నారు. ఆయన నటించిన యాక్షన్ ఎంటర్



టైనర్ 'సర్కారు వారి పాట'. పరశురామ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది.మే 12న వరల్డ్ వైడ్ గా ఈ సినిమాని రిలీజ్ చేయడానికి మేకర్స్ భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టీజర్ సాంగ్స్ సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. దీనికి తోడు స్వయంగా మహేష్ ఈ మూవీ 'పోకిరి' వైబ్స్ ని కలిగిస్తోందని ఆ రేంజ్ హిట్ కావడం గ్యారంటీ అంటూ హింట్ ఇచ్చేయడంతో మహేష్ ఫ్యాన్స్ ఆనందంతో సంబరాల్లో మునిగితేలుతున్నారు. సినిమా రిలీజ్ కి మరో రెండు వారాలు మాత్రమే వుండటంతో చిత్ర బృందం ప్రచార పర్వానికి తెరలేపింది.మే 2 న ఈ మూవీ ట్రైలర్ ని విడుదల చేస్తున్నట్టుగా చిత్ర బృందం గురువారం సాయంత్రం ఓ పోస్టర్ ని విడుదల చేస్తూ ప్రకటించింది. చాలా రోజులుగా ఈ వార్త కోసం ఎదురుచూస్తున్న అభిమానులు ఆనందంతో గెంతులేస్తున్నారు. టీజర్ తో సినిమా ఓ రేంజ్ లో వుంటుందని క్లారిటీ ఇచ్చిన మేకర్స్ ట్రైలర్ తో ఆ అంచనాలని మరింతగా పెంచబోతున్నారు. యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఈ చిత్రంలోని మహేష్ టుక్ ఇప్పటికే అభిమానుల్లో ట్రేడ్ వర్గాల్లో సినిమాపై మంచి బజ్ ని క్రియేట్ చేసింది.ఇదిలా వుంటే సూపర్ స్టార్ మహేష్ ఫ్యామిలీతో కలిసి పారిస్ వీధుల్లో విహరిస్తున్నారు. ఇటీవలే 'సర్కారు వారి పాట' చిత్రీకరణ పూర్తయిపోవడంతో విశ్రాంతి కోసం కుటుంబంతో కలిసి పారిస్ వెళ్లిన సూపర్ స్టార్ మహేష్ పిల్లలు సతార గౌతమ్ తో కలిసి పారిస్ వీధుల్లో విహరిస్తూ హల్ చల్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోని సోషల్ మీడియా ఇన్ స్టా వేదికగా మహేష్ వైఫ్ నమ్రత అభిమానులతో పంచుకున్నారు.ఫ్యామిలీ వెకేషన్ ని పూర్తి చేసుకుని త్వరలో మహేష్ హైదరాబాద్ రానున్నారు. 'సర్కారు వారి పాట' మే 12న విడుదల కానున్న నేపథ్యంలో ప్రమోషన్స్ లో పాల్గొనబోతున్నారు. 'సరిలేరు నీకెవ్వరు' వంటి బ్లాక్ బస్టర్ తరువాత దాదాపు రెండున్నరేళ్ల విరామం అనంతరం మహేష్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు కూడా ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తొలి సారి కీర్తిసురేష్ తో కలిసి మహేష్ నటించిన సినిమా ఇది. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఓ రేంజ్ కుదరడంతో సినిమాలో రొమాంటిక్ సన్నివేశాలకు కొదవలేదని తెలుస్తోంది.

# గుజరాత్ టైటాన్స్ వర్సెస్ ఆర్సీబీ.. విజయం ఎవరిది..?




ఐపీఎల్-2022లో భాగంగా శనివారం బ్రబౌర్న్ వేదికగా తాడోపేడో తేల్చుకోవడానికి గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు సిద్ధమయ్యాయి. ఈ మ్యాచ్ మధ్యహ్నం 3:30 గంటలకు ప్రారంభం కానుంది. ఈ ఏడాది సీజన్లో వరుస విజయాలుతో దూసుకుపోతున్న గుజరాత్ టైటాన్స్.. ఈ మ్యాచ్లో ఆర్సీబీను చిత్తు చేయాలని భావిస్తోంది. ఇప్పటి వరకు 8 మ్యాచ్లు ఆడిన గుజరాత్ టైటాన్స్ 7 విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో ఉంది. గుజరాత్ టైటాన్స్ బ్యాటింగ్, బౌలింగ్ పరంగా పటిష్టంగా కన్పిస్తోంది.కాగా ఓపెనర్ శుభ్మాన్ గిల్ ఫామ్లో లేకపోవడం ఆ జట్టుకు కాస్త ఇబ్బంది పెట్టే విషయం. మరో వైపు కెప్టెన్ హార్ధిక్ పాండ్యా అద్భుతమైన ఫామ్లో ఉండటం ఆ జట్టుకు కలిసిచ్చే అంశం. మిడిలార్డర్లో మిల్లర్, తెవాటియా వంటి హిట్టర్లు ఉన్నారు. అఖరిలో రషీద్ ఖాన్ కూడా బ్యాట్ ఝులిపిస్తున్నాడు. ఇక బౌలింగ్ విషయానికి వస్తే.. మహ్మద్ షమీ, లాకీ ఫెర్గూసన్ వంటి స్టార్ బౌలర్లు ఉన్నారు. ఇక వరుస రెండు ఓటములతో డీలా పడ్డ ఆర్సీబీ.. గుజరాత్పై విజయం సాధించి తిరిగి పుంజుకోవాలని భావిస్తోంది. ఆర్సీబీ బౌలింగ్ పరంగా రాణిస్తున్నప్పటికీ.. బ్యాటింగ్లో కాస్త తడబడుతోంది. విరాట్ కోహ్లి ఫామ్లో లేకపోవడం ఆ జట్టును కలవరపెడుతోంది.పిచ్ రిపోర్ట్

ఈ గ్రౌండ్లో ఆర్సీబీ కేవలం 68 పరుగులకే ఆలౌటైంది. ఈ పిచ్ బౌలర్లకు అనుకులిస్తుంది. కాబట్టి ఈ మ్యాచ్లో టాస్ గెలిచిన కెప్టెన్ ముందుగా బౌలింగ్ చేసే అవకాశం ఉంది.తుది జట్లు అంచనాగుజరాత్ టైటాన్స్: వృద్ధిమాన్ సాహా (వికెట్ కీపర్), శుభమాన్ గిల్, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), అభినవ్ మనోహర్, డేవిడ్ మిల్లర్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, అల్జారీ జోసెఫ్, లాకీ ఫెర్గూసన్, యశ్ దయాల్, మహమ్మద్ షమీ

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

ఫాఫ్ డు ప్లెసిస్ (కెప్టెన్), విరాట్ కోహ్లి, గ్లెన్ మాక్స్వెల్, మహిపాల్ లోమ్రోర్, రజత్ పటీదార్, షాబాజ్ అహ్మద్, దినేష్ కార్తీక్ (వికెట్ కీపర్), వనిందు హసరంగా, హర్షల్ పటేల్, జోష్ హేజిల్వుడ్, మహ్మద్ సిరాజ్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**